# మనం


జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 1 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 29 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## 94 ఏండ్ల వయస్సులో సినిమా దర్శకత్వం

రికార్డులకెక్కనున్న సింగీతం శ్రీనివాసరావు



2

## కారుకు బేడీలు



2

# 11 గంటలకు బడ్జెట్

### పార్లమెంటులో పెట్టనున్న మంత్రి నిర్మలాసీతారామన్



**హైదరాబాద్, జనవరి 31:** ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలను నేడు ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు సమర్పిస్తారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఆదివారం రోజున బడ్జెట్ ను సమర్పిస్తుండడం ఒక విశేషం. కాగా, ఒక మహిళా ఆర్థిక మంత్రి వరుసగా ఒకే ప్రధాని నేతృత్వంలో సమర్పించనున్న తొమ్మిదవ కేంద్ర బడ్జెట్ కావడం మరో విశేషం. ఈ బడ్జెపై దేశవ్యాప్తంగా ప్రజలు, వ్యాపార వర్గాలు, మధ్య తరగతి వేతనదారుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని ముందుంచుకుని ఆర్థిక సంస్కరణలు, కస్టమ్స్ డ్యూటీ మార్పులు, రుణ తగ్గింపు, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఈ బడ్జెట్లో మరింత దృష్టి సారించే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను రాయితీలు, రక్షణ, వ్యవసాయం, ఆర్థిక వృద్ధి వంటి రంగాల్లో ప్రజలు, వ్యాపారవేత్తలు ఆశలు పెట్టుకున్నారు. రాజ్యాంగపు ఆర్టికల్ 112 ప్రకారం.. ఏటా ఉభయ సభల ముందూ సమర్పించే ఈ ఆర్థిక ప్రకటనలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆదాయాలు, ఖర్చుల అంచనాలు, పన్ను ప్రతిపాదనలు, వ్యయ ప్రాధాన్యాలు, సంస్కరణలు, అభివృద్ధి చర్యలు వివరిస్తారు.

## మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్

2

# సైకిల్‌కు ఓటేశారు...
# అభివృద్ధికి చోటిచ్చారు

### ప్రజా సంక్షేమమే కూటమికి పరమావధి
### అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పమే ప్రయోగశాల
### 2026లో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు





- నివాసం నుంచి ప్రజావేదిక వరకూ ఇ-సైకిల్ తో ర్యాలీగా వచ్చిన సీఎం
- 24 గంటల్లో 5555 ఇ-సైకిళ్ల పంపిణీతో కుప్పానికి గిన్నీస్ రికార్డు
- కుప్పంలో పేదల సేవలో కార్యక్రమం
- ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**కుప్పం, జనవరి 31 మనం న్యూస్:** గత ఎన్నికల్లో సైకిల్ కు ఓటేసి ప్రజలు అభివృద్ధికి చోటిచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం బెగ్గిలపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. బెగ్గిలపల్లెలో ముగ్గురు లబ్దిదారుల నివాసాలకు వెళ్లిన సీఎం మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్న తాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకట రామప్ప అనే లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛను అందించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాగోగులు అడిగితెలుసుకున్నారు. ఆ గ్రామానికి వెళ్లే మార్గంలో తనను చూసేందుకు తరలి వచ్చిన మహిళలకు సీఎం చంద్రబాబు అప్యాయంగా పలకరించారు. గ్రామస్థుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అంతకుముందు బెగ్గిలపల్లె మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. అనంతరం పేదల సేవలో ప్రజా వేదిక బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇవ్వనంత సంక్షేమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందిస్తున్నామని సీఎం వివరించారు. ప్రతీ నెలా రూ. 2730 కోట్ల మేర పెన్షన్ల రూపంలో లబ్దిదారులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పొరుగున తమిళనాడులో నెలకు రూ. 315 కోట్లు, కర్ణాటకలో రూ. 392 కోట్లు పెన్షన్లు నిమిత్తం ఖర్చు చేస్తున్నారని

...మిగతా 2లో

## కల్తీ నెయ్యి వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే: మంత్రి పయ్యావుల



**అమరావతి:** తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపాకు క్లీన్‌చీట్ రాలేదని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. క్లీన్‌చీట్ అంటూ ఆ పార్టీ చేసుకునేది అసత్య ప్రచారమని మండిపడ్డారు. ఈ అంశంపై పయ్యావుల మీడియాతో మాట్లాడారు. ''లడ్డూ పవిత్రతను కాపాడేందుకు తెదేపా ప్రభుత్వం అనేక నిబంధనలు ప్రవేశపెట్టింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిబంధనలు సడలించి కల్తీకి బీజం వేసింది. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉంది. జంతు అవశేషాలు ఉన్నాయని ఎన్డీడీబీ నిర్ధరణ చేసిన అంశమే సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఇదే అంశం సిట్ అనుబంధ ఛార్జ్‌షీట్

...మిగతా 2లో

# అంబటి అరెస్టు

### సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు

- తెలుగు తమ్ముళ్ల ఫైర్ • రాంబాబు ఇంటిపై దాడి
- వైసీపీ నుంచి అంబటి రాంబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్
- అంబటి వ్యాఖ్యలు క్షమించరాని నేరం అన్న కూటమి నేతలు






**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. సీఎం నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతల ఫిర్యాదుతో గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. అంబటి రాంబాబు ఇంటి ముట్టడికి టీడీపీ కార్యకర్తలు, తెలుగు మహిళలు యత్నించటంతో గుంటూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదంపై వైసీపీ పాప ప్రక్షాళన పేరుతో పూజల కార్యక్రమం చేపట్టింది. ఇందులో పాల్గొనేందుకు అంబటి రాంబాబు గోరంట్లకు బయల్దేరారు. ఈ క్రమంలోనే వైసీపీ, టీడీపీ శ్రేణులు ఎదురెదురు పడ్డాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమయంలో సహనం కోల్పోయిన అంబటి రాంబాబు.. సీఎం చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు.

**రాంబాబు వ్యాఖ్యలపై తెలుగు తమ్ముళ్ల ఫైర్**

చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడ్డారు. ఈ విషయంపై మంత్రి పార్థసారథి, సీనియర్ లీడర్ వర్ల రామయ్య స్పందించారు. చంద్రబాబును, ఆయన తండ్రిని ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్న మంత్రి.. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**11 సీట్లు వచ్చినా బుద్ధి రాలేదు..**

సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను కూటమి పార్టీల నేతలు ముక్త కంఠంతో ఖండించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలు అత్యంత హేయమైనవనిఏపీ బీజేపీ నేతలు మండిపడ్డారు. మంత్రిగా పని చేసిన వ్యక్తి హుందాతనం మరిచారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా అంబటి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. అంబటి రాంబాబు నీచ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం అన్నారు. వైసీపీకి 11 సీట్లు వచ్చినా ఇంకా ఆ పార్టీ నాయకుల్లో మార్పు రాలేదని విమర్శించారు. రాజకీయాల్లో దిగజారుడు భాషకు చోటు లేదన్నారు. అంబటి రాంబాబును వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**అంబటి నీచంగా మాట్లాడారు: మంత్రి అచ్చెన్నాయుడు**

చంద్రబాబుపై అంబటి నీచంగా మాట్లాడారు. అంబటి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. వైసీపీ దిగజారుడు రాజకీయాలకు ఇది పరాకాష్ట. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రూ.250 కోట్లకుపైగా స్కామ్ నుంచి తప్పించుకునేందుకే ఈ డైవర్షన్ పాలిటిక్స్. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా వైసీపీకి బుద్ధి రాలేదు అని


...మిగతా 2లో

## తప్పు చేసి మరీ.. వైకాపా సమర్థించుకునే ప్రయత్నం: టీజీ భరత్



**కర్నూలు:** కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపా నేతలు తప్పు చేసి.. ఇప్పుడేమో అడ్డంగా వాదిస్తున్నారని మంత్రి టీజీ భరత్ విమర్శించారు. కర్నూలు నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెన్షన్లు ఎంతో పారదర్శకంగా.. ఒక రోజు ముందే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ''కూటమి ప్రభుత్వం మాత్రమే తిరుమల పవిత్రతను కాపాడుతోంది. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరగలేదని సిట్ ఎక్కడా చెప్పలేదు. తప్పు చేసి మరీ.. సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవుడి ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలి. అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై చర్చిస్తాం. దావోస్ పర్యటనలో రాష్ట్రాన్ని అత్యుత్తమంగా ప్రమోట్ చేశాం. దీని ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయి'' అని టీజీ భరత్ తెలిపారు.

## బిడ్డల్లారా.. మల్లొస్తం




2

## మరోసారి మూతబడ్డ అమెరికా




2



# సోషల్ మీడియా.. చిన్నారుల మెదళ్లను తినేస్తుంది

### నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్

**ఢిల్లీ, జనవరి 31:** యువత సోషల్ మీడియా విపరీత వాడకంపై ఇటీవలి ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ డిజిటల్ వ్యసనం ఆర్థిక దుష్పరిణామాలకు దారితీస్తుందని, వయసుపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందన్న సూచనలపై నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ ఏకీభవించారు. చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందన్న ఆయన.. స్కూళ్లు, కాలేజీల్లో వీటి వాడకాన్ని నిషేధించాలన్నారు. 'సోషల్ మీడియాలో వయోపరిమితి అవసరమని ఆర్థిక సర్వే సూచనతో వందశాతం ఏకీభవిస్తున్నా. ఇది చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉత్పాదకతను, ఏకాగ్రతను తగ్గిస్తుంది. దీని ఫలితంగా దీర్ఘకాలంలో ఆన్లైన్లో ఉంటూ, వాస్తవిక ప్రపంచంలో కష్టపడి పనిచేయలేని తరం ఏర్పడుతుంది. ఇలా మనం వికసిత్ భారత్ను నిర్మించలేం. నిజానికి.. స్కూళ్లు, కాలేజీల్లో దీన్ని పూర్తిగా నిషేధించాలి' అని అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు.


**ఆర్థిక సర్వే ఏం చెప్పింది..?**

భారత్లో యువత సామాజిక మాధ్యమాల వినియోగం తీరుపై ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. దేశంలో ఈ డిజిటల్ వ్యసనం తీవ్ర ఆర్థిక పరిణామాలకు

...మిగతా 2లో

# అప్పులు అడగాలంటే సిగ్గేసింది

### పాక్ ప్రధాని షరీఫ్



**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తో కలిసి నేను రహస్యంగా మిత్ర దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం

...మిగతా 2లో

# సైకిల్‌కు ఓటేశారు... అభివృద్ధికి చోటిచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీలో పేదలకు ఏ స్థాయిలో పెన్షన్ అందచేస్తున్నామనేది గుర్తించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేశామన్నారు. దీపం-2.0 పథకం కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని వివరించారు. అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పించింది టీడీపీనే అని అన్నారు. ఆస్తిలో సమాన హక్కు ఎన్టీఆర్ కల్పిస్తే తాను 33 శాతం రిజర్వేషన్లను ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో అమలు చేసినట్టు వివరించారు. త్వరలో చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు రానున్నాయన్నారు. సమీప భవిష్యత్తులో మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులుగా ఎదుగుతారని అన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని మరింత పెంచుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ఓ ప్రయోగశాల...**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం నియోజకవర్గమే ఓ ప్రయోగశాల అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అక్కడ అమలు చేసి విజయవంతమైన మోడళ్లను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి విజయం సాధిస్తున్నామని తెలిపారు. కుప్పంలో పైలట్ గా ప్రారంభించి విజయవంతమైన డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు సంజీవనిని ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని సీఎం అన్నారు. మెరుగైన వైద్యాన్ని సేలవను ప్రజల ఇంటి వద్దకే అందుబాటులోకి తెచ్చేలా ఈ సంజీవని ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించినట్టు




స్పష్టం చేశారు. ఫోన్ల ద్వారా వైద్యుల అపాయింట్మెంట్లు, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ద్వారా ప్రజలకు విద్యుత్ భారం తగ్గేలా చూస్తున్నామని.. కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును సమర్ధంగా అమలు చేస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకువచ్చి రైతులకు నీళ్లు అందించామని సీఎం అన్నారు. నియోజకవర్గంలో వర్షపు నీటిని కూడా సద్వినియోగం చేసుకునేలా లింక్ కెనాల్స్, చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని వివరించారు. కుప్పంలోని యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రూ. 7088 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు వచ్చాయని వీటి ద్వారా 34 వేల పైచిలుకు మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి లభించేలా చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఆదిత్య బిర్లా సంస్థతో కలిసి మల్టీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ప్రారంభించామని తెలిపారు. వర్క్ ఫ్రం హోం చేసుకునే వారికి... ఆఫీసు స్పేస్ లేని వారికి ఉపయోగపడేలా కుప్పంలో రాష్ట్రంలోనే తొలి కో-వర్కింగ్ స్పేస్ ను ఏర్పాటు చేశామని అన్నారు. కంగుంది ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రాక్ క్లైంబింగ్ పార్కును కూడా అభివృద్ధి చేశామన్నారు. ఫ్లవర్ ఫెస్టివల్ ద్వారా పర్యాటకానికి దారులు తెరిచామని.. ఇక్కడ హోం స్టేలు కూడా అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. మొత్తంగా కుప్పంలో ప్రతీ ఒక్కరికీ ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నామని దానిని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హంద్రీనీవా, గాలేరు నగరి సహా రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేస్తామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ తో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతామని కుప్పం అభివృద్దే దానికి మొదటి మెట్టని ముఖ్యమంత్రి వివరించారు.

**ఐదేళ్ల పాటు పట్టి పీడించటం వల్లే రాష్ట్రానికి కష్టాలు**

విధ్వంస పాలనతో రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు నెట్టారని.. వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగానే కూటమి ప్రభుత్వానికి వారసత్వ సమస్యలు వచ్చాయని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకున్నారని, గెలాక్సీ గ్రానైట్ తో సరిహద్దు రాళ్లు తయారు చేయించి వాటిపై బొమ్మలు ముద్రించారని అన్నారు. దీనికోసం రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. దుర్మార్గం చేసింది చాలక తమ పాలనే బెటర్ అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ఓ నల్ల చట్టం తెచ్చారని.. భూ వివాదాలు వస్తే స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేశారన్నారు. ప్రజల ఆస్తులు కాజేసే ఘోరమైన చట్టం చేసి తనదే గొప్ప చట్టం అంటూ బుకాయిస్తున్నారని సీఎం అన్నారు. 22 ఏ పేరుతో భూ వివాదాలు సృష్టించారని ఆ వివాదాలు పరిష్కరించేందుకు ఆయన పెట్టుకున్న గుమస్తాకే అప్పగించేలా చట్టం చేసుకున్నారని ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన నల్ల చట్టాన్ని రద్దు చేసి... ఆ పాలనలో జరిగిన సర్వే తప్పిదాలను సరిచేస్తున్నామని అన్నారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నామని అన్నారు. పేదలకు అండగా ఉండేలా వివిధ రకాల కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ- మహిళా సాధికారిత లక్ష్యంగా ఇ-సైకిళ్ల పంపిణీ**

పర్యావరణ పరిరక్షణ- సాధికారత లక్ష్యంగా మహిళలకు ఇ-సైకిళ్లను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. 24 గంటల వ్యవధిలో 5555 సైకిళ్లను లబ్దిదారులకు పంపిణీ చేసి గిన్నీస్ వరల్ రికార్డును కుప్పం నియోజకవర్గం నమోదు చేసింది. ఇ-సైకిళ్లను ఇంత పెద్ద సంఖ్యలో పంపిణీ చేయటంపై ఈ రికార్డు నమోదు అయినట్టు గిన్నీస్ వరల్ బుక్ అజుడికేటర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సైకిళ్ల తయారీ సంస్థ ఇ-మోటరాడ్ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందించారు. కుప్పాన్ని కాలుష్య రహితంగా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇ- సైకిళ్లకు సూపర్ సైకిల్ అని పేరుపెట్టినట్టు సీఎం వివరించారు. 60 కిలోమీటర్ల వరకూ సైకిల్ పైనే ప్రయాణించి పనులు చేసుకోవచ్చని సీఎం తెలిపారు. వీటి ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు కాలుష్యాన్ని కూడా తగ్గించేలా చూస్తున్నామని అన్నారు. ఇ-సైకిళ్ల వినియోగం ద్వారా ప్రతీ కుటుంబం రూ.1000 నుంచి 1500 వరకూ ఆదా చేసుకోవచ్చని అన్నారు. స్కూటర్ ద్వారా ప్రతీ కిలోమీటరు ప్రయాణానికి 68 గ్రాముల మేర కార్బన్ డై ఆక్సైడ్ విడుదలై కలుషితం అవుతుందని.. ఇ-సైకిల్ ద్వారా కేవలం 15 గ్రాములు మాత్రమే పరోక్షంగా వస్తుందని తద్వారా 75 శాతం ఉద్గారాలు తగ్గుతాయన్నారు. ప్రతీ వెయ్యి ఇ- సైకిళ్ల ద్వారా ఏడాదికి 37 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ తగ్గుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సైకిల్ అంటే పురోగతికి చిహ్నమని.. ఇ-సైకిల్ ఈ తరానికి సింబల్ గా నిలుస్తుందని అన్నారు. కడుపల్లెలోని తన నివాసం నుంచి ముఖ్యమంత్రి ఇ- సైకిళ్లపై ర్యాలీగా ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు.

# కారుకు బేడీలు

**జబల్పూర్, జనవరి 31:** డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి కారు స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల తర్వాత అతడ్ని పంపివేశారు. అయితే, పోలీస్ స్టేషన్లో ఉంచిన ఆ కారుకు బేడీలు వేశారు. మధ్యప్రదేశ్లోని జబల్పూర్లో ఈ సంఘటన జరిగింది. దామోహ్ నాకా ప్రాంతానికి చెందిన ప్రథమ్ కుమార్ మద్యం సేవించి కారు నడిపాడు. డ్రంక్ అండ్ డ్రైవ్లో పోలీసులు అతడి కారును స్వాధీనం చేసుకున్నారు. వైద్యపరీక్షల తర్వాత ప్రథమ్ కుమార్ను వదిలేసి, కారుకు మాత్రం బేడీలు వేశాలరు.

# అప్పులు అడగాలంటే సిగ్గేతుంది

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పాకిస్తాన్ కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఆర్థికసాయం అందించిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉందన్నారు. మిత్ర దేశాల నుంచి అప్పులు కోరడంపై పాక్ ప్రధాని నిరాశ వ్యక్తంచేయడం ఇదేం తొలిసారి కాదు.

## సోషల్ మీడియా.. చిన్నారుల మెదళ్లను తినేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

దారితీస్తుందని హెచ్చరించింది. అనేక అంశాలు నేర్చుకునేందుకు, ఉద్యోగానికి, పౌర భాగస్వామ్యాన్ని పెంచడంలో సోషల్ మీడియా దోహదపడుతున్నప్పటికీ.. తీవ్ర వాడకం వల్ల ఆర్థిక, సామాజిక నష్టాలు తప్పవని స్పష్టం చేసింది. దేశ యువతలో మానసిక ఆరోగ్య సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందంటూ.. ఇందుకు సంబంధించిన దేశీయ, అంతర్జాతీయ అధ్యయనాలను ప్రస్తావించింది.

## కల్తీ నెయ్యి వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే: మంత్రి పయ్యావుల

(మొదటి పేజీ తరువాయి)

35వ పేజీలోనూ స్పష్టంగా ఉంది.'' ''కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు అంత తేలిగ్గా వదలిపెట్టరు. ఈ వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే. సీఎం కుప్పం పర్యటన అనంతరం కఠిన చర్యలు తీసుకుంటారు. తిరుమలలో ప్రక్షాళన కొనసాగాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా చాలా అంశాలు బయటకు రావాల్సి ఉంది. నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే తేల్చారు. ఆ నివేదికను తొక్కిపెట్టి అప్పటి వైకాపా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు చర్యలు తీసుకోలేదో ఆ పార్టీ సమాధానం చెప్పాలి. దేవదేవుడి పట్ల వారికి నమ్మకం లేదనుకోవాలా?'' అని మంత్రి పయ్యావుల అన్నారు.

# బిడ్డల్లారా.. మల్లోస్తం

- వనప్రవేశం చేసిన గిరిజన దేవతలు
- ముగిసిన సమ్మక్క, సారలమ్మ మహాజాతర

**మేడారం, జనవరి 31:** మూడు రోజులుగా భక్తుల కొంగుబంగారంగా కొనసాగిన గిరిజన మహా జాతర ముగిసింది. సమ్మక్క, సారలమ్మలు గద్దెల నుంచి బయలుదేరి తిరిగి వన ప్రవేశం చేశారు. తల్లులారా మళ్లొస్తం.. అంటూ భక్తులు కూడా తమ ఇండ్లకు బయలుదేరారు.

రెండు రోజులపాటు గద్దెలపై కొలువుదీరిన తల్లులకు భక్తులు మొక్కులు చెల్లించి వారి సన్నిధిలో ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యుల భక్తి పూర్వకంగా గడిపారు. శివసత్తుల పూనకాలు.. భక్తుల సంగీత సంరంభాలు ఆడవి ప్రాంతాన్ని మోతెక్కించాయి. దేవతలు వనంలోకి, భక్తులు ఇళ్లకు మరలడంతో జాతర పరిసర ప్రాంతాలు మొత్తం మూగబోతున్నాయి.



# అంబటి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అచ్చెన్నాయుడు విరుచుకుపడ్డారు.

**నోటికొచ్చింది మాట్లాడితే సహించేది లేదు: హోం మంత్రి అనిత**

అంబటి రాంబాబు ఏపీ సీఎం చంద్రబాబుపైన చేసిన వ్యాఖ్యలపైన ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు.అంబటి రాంబాబు చంద్రబాబు పైన మాట్లాడిన తీరు అత్యంత అనుచితమని ఆమె అన్నారు. గతంలో తాను గౌరవంగా అంబటి రాంబాబు గారు అని పిలిచే దానిని అని పేర్కొన్న హోమ్ మంత్రి వంగలపూడి అనిత, కానీ ఇప్పుడు ఆ గారు అనే పదానికి అంబటి రాంబాబు అర్హుడు కాదన్నారు. ఆయన మాట్లాడిన మాటలు ప్రజాస్వామ్యానికి హానికరమని అనిత అభిప్రాయపడ్డారు.ఆయన చేసిన వ్యాఖ్యల పైన ఇంటికి వెళ్లి తన భార్యను కూతురును అడగాలని వ్యాఖ్యలు చేశారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వాళ్ళపైన కఠిన చర్యలు తప్పవన్నారు.అంబటి రాంబాబు లాంటి వాళ్ల కోసం మాట్లాడాల్సి రావడమే సిగ్గుచేటు అంటూ ఆమె వ్యాఖ్యానించారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో పట్టాభి ఒక పదం ఉపయోగించారు అనే కారణంతో టిడిపి పార్టీ ఆఫీస్ మీద దాడి చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు గురించి ఇష్టానుసారం మాట్లాడితే కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

**అంబటి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి: మంత్రి ఆనం**

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంబటి వ్యాఖ్యలు అత్యంత అనుచితంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై బూతు మాటలతో దూషణలకు దిగడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని, ముఖ్యమంత్రికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి ఆనం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు హద్దులు దాటితే ప్రజలు ఏమాత్రం సహించరని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు తమ మాటల పట్ల సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు.

ఈ రోజు నుంచి సినిమా చూపిస్తాం: కేంద్రమంత్రి పెమ్మసాని

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అంబటి అత్యంత అనుచితమైన భాషలో వ్యాఖ్యలు చేశారంటూ మండిపడ్డారు. ఇప్పటివరకు అంబటిని సహనంతో భరించామని, ఇకపై ఆయనకు అసలు సినిమా చూపిస్తామని హెచ్చరించారు. 24 గంటల్లో తమ స్పందన ఎలా ఉంటుందో తెలుస్తుందని అల్టిమేటం జారీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, 'బరితెగించి మాట్లాడేవారికి భయపడేలా ట్రీట్మెంట్ ఉంటుంది. మేం చట్టబద్ధంగా వెళితే ఏం జరుగుతుందో అంబటికి త్వరలోనే తెలుస్తుంది' అని వ్యాఖ్యానించారు. వైసీపీ నేతలు కావాలనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు.

సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారు: మంత్రి పార్థసారథి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల

వైసీపీ నేత అంబటి రాంబాబుపై ఏపీ మంత్రి పార్థసారథి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తండ్రిని ఉద్దేశించి అంబటి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని అన్నారు. ఆయన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అంబటి రాంబాబు తక్షణమే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అన్నారు. అంబటి రాంబాబు చరిత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఇలాంటి వ్యక్తి చేసిన అసభ్యకర వ్యాఖ్యలు చంద్రబాబు ఔన్నత్యాన్ని తాకలేవని చెప్పారు. అంబటి వాడిన పదజాలాన్ని ఆయన భార్యాబిడ్డలు కూడా ఛీకొడతారని అన్నారు. జగన్ భార్య భారతి గురించి మాట్లాడిన టీడీపీ నేతను అరెస్ట్ చేయించి రిమాండ్ కు పంపామని... ఇప్పుడు అంబటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ అనేది రాజకీయ పార్టీనా? లేక రౌడీల పార్టీనా? అని ప్రశ్నించారు.

**ఆవేశంలో అలా మాట్లాడా: అంబటి రాంబాబు**

చంద్రబాబును తాను బూతులు తిట్టలేదని.. తన కారుపై దాడి చేసి.. తనను తిడుతున్న టీడీపీ వాళ్లను తిట్టినట్లు అంబటి రాంబాబు అన్నారు. అయితే మధ్యలో చంద్రబాబు పేరు వచ్చిందన్నారు. తనను తిడుతున్నారనే ఆవేశంలో అలా మాట్లాడానన్న అంబటి రాంబాబు.. ఈ వయసులో, ఈ హోదాలో అలా మాట్లాడి ఉండాల్సింది కాదని చెప్పుకొచ్చారు. తనను అరెస్ట్ చేయాలని చంద్రబాబు నుంచి పోలీసులకు ఆదేశాలు వచ్చాయని.. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని అంబటి రాంబాబు అన్నారు. చంద్రబాబుకు, నారా లోకేష్కు, రెడ్ బుక్కు తన కుక్క కూడా భయపడదంటూ అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.




# మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్




**ముంబై, జనవరి 31:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. దీనితో ఆ రాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర రికార్డులకెక్కారు. ముంబయిలోని లోక్ భవన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. మహారాష్ట్ర బారామతిలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంతో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన సతీమణి సునేత్రను పార్టీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఉప ముఖ్యమంత్రిగా ఆమె నేడు ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థికశాఖ మినహా ఎక్సైజ్, క్రీడా మంత్రిత్వ శాఖలను సునేత్రకే కట్టబెడతారని వార్తలు వెలువడుతున్నాయి.

# 94 ఏండ్ల వయస్సులో సినిమా దర్శకత్వం

## రికార్డులకెక్కనున్న సింగీతం శ్రీనివాసరావు

**హైదరాబాద్, జనవరి 31:** వైవిధ్యంగా సినిమాలు తీయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.. ప్రయోగాత్మక చిత్రాలకే కేరాఫ్ అడ్రస్.. మాటలే లేకుండా మూవీ తీసిన సినీ రుషి. ఆయనే సింగీతం శ్రీనివాసరావు. సుదీర్ఘ విరామం తర్వాత 94ఏళ్ల వయసులో మళ్లీ మెగా ఫోన్ పట్టారు. ఆయన దర్శకత్వంలో వెజయంతీ మూవీస్ బ్యానర్పై కొత్త చిత్రం రూపొందుతోంది. ఇటీవల పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ మూవీని ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఓ వీడియోను పంచుకుంది. ఆయన ప్రతిభా పాటవాలను గుర్తు చేసుకుంటూ హీరోలు, దర్శకులు చెప్పిన మాటలు వీడియోలో వినిపించాయి. ఇది సింగీతం శ్రీనివాసరావు 61వ సినిమా కావడం విశేషం.



# మరోసారి మూతబడ్డ అమెరికా

## ట్రంప్ కాలంలోనే ఎక్కువ సార్లు షట్ డౌన్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగిసింది. దాంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్ లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ (ఐసీఈ) అధికారుల కాల్పుల్లో మరణించడంతో సెనెట్ డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు 'చట్టాన్ని అమలుచేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐసీఈ అధికారులను ఉపేక్షించబోరు' అని తీవ్రంగా స్పందించారు. దానిని సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమంటూ వారు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి.

అయితే ఇది పాక్షికమేనని వచ్చేవారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని చట్టసభ సభ్యులు తెలియజేశారు. గతేడాది అక్టోబర్ 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం (43 రోజులు)పాటు కొనసాగింది. అమెరికాలో షట్డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. 1981 నుంచి యూఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.




# నగరంలో కాల్పుల కలకలం

## తుపాకితో కల్పులు...రూ. 6 లక్షలు చోరీ

**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలోని కోఠి బ్యాంక్ స్ట్రీట్లో శనివారం ఉదయం కాల్పులు కలకలం రేపాయి. ఎస్బీఐ ప్రధాన కార్యాలయం వద్ద ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తిపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపి.. రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం 7 గంటలకు రషీద్ అనే వ్యక్తి బ్యాంక్ ఏటీఎంలో రూ.6లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు బ్యాంక్ స్ట్రీట్కు వచ్చాడు.

రషీద్ డబ్బులతో రావడం గమనించిన కొందరు దుండగులు అతడిని వెంబడించారు. అది గమనించి రషీద్ పారిపోతుండటంతో అతనిపై కాల్పులు జరిపి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో రషీద్ కాలికి గాయమైంది. దీనిపై సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. రషీద్ను ఆస్పత్రికి తరలించిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. విచారణలో భాగంగా ఘటనాస్థలిలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు.

**ప్రత్యేక బృందాలు :**

కాల్పులకు తెగబడిన నిందితుల కోసం 5 బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు.

ఘటనా స్థలంలో రెండు బుల్లెట్ షెల్స్ను స్వాధీనం చేసుకున్నామని, క్లూస్ టీం ఇప్పటికే ప్రాథమిక వివరాలను సేకరించిందని ఆమె వెల్లడించారు. కాల్పులు జరిగిన వెంటనే అప్రమత్తమయ్యామని, నిందితులు తప్పించుకోలేరని ఆమె తెలిపారు.

**దారిమళ్లించే యత్నం:** కాల్పుల వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. దొంగలను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

# 5555 ఇ-సైకిళ్ల పంపిణీ చేపట్టి గిన్నిస్ రికార్డు సాధించిన చిత్తూరు జిల్లా

## సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని అందుకున్న చిత్తూరు జిల్లా కలెక్టర్

## కుప్పాన్ని కాలుష్య రహితంగా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5555 ఇ-సైకిళ్ల పంపిణి




**కుప్పం, జనవరి 31 మనం న్యూస్ :** కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'కుప్పంలో 5555 సూపర్ ఇ-సైకిళ్లను మహిళలకు అందచేశాం.గతంలో ఒకేసారి పెద్దమొత్తంలో సైకిళ్లను డెలివరీ చేసిన రికార్డును తుడిచి పెట్టి కుప్పంలో చరిత్ర సృష్టించాం. ఇ-సైకిళ్ల వల్ల రాబోయే కాలంలో ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇ-సైకిళ్లకు సూపర్ సైకిల్ అనే పేరు పెట్టాం. 60 కిలో మీటర్ల వరకు ఈజీగా సైకిల్ మీద వెళ్లి పని చేసుకోవచ్చు. సైకిల్ ఎక్కడికైనా దూసుకెళ్తుంది అదే ఈ సూపర్ సైకిల్. మొన్నటి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేశారు. ఇప్పుడు ఆ సైకిల్ ద్వారా మీ ఆరోగ్యం బాగుండేలా చూస్తున్నాం. కాలుష్యం తగ్గించేలా కృషి చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణ, మహిళల సాధికారతే లక్ష్యంగా 5,500 ఈ-సైకిళ్లు పంపిణీ చేశాం. 24 గంటల్లో 5555 ఈ-సైకిళ్లు లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉంది. ఇది కేవలం రికార్డ్ కాదు - కుప్పం అభివృద్ధిలో సరికొత్త ప్రయాణం. లబ్ధిదారుల్లో చాలా మందికి ఈ-సైకిళ్లు ఎంతో సహాయకారిగా ఉంటాయి. విద్యార్థులు తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణానికి వీలు కలిగింది. నెలకు ఒక్కో కుటుంబానికి దీని ద్వారా రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఆదా అవుతుంది. మహిళకు సమయం కలిసి రావడంతో పాటు, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భావిస్తున్నాను. అన్నింటికన్నా ముఖ్యంగా పర్యావరణానికి మేలు చేస్తుంది. కాలుష్య రహితంగా కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం./ఎప్పుడూ కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది, ఫలితాలు అందరికీ దక్కుతాయి' అని అన్నారు.

## రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్లో ద్విశతకం 200 సాధించిన సీ.ఆర్. జ్ఞానేశ్వర్

- రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ చైర్మన్ సీఆర్ రాజన్

**తిరుచానూరు, జనవరి 31(మనం న్యూస్):** నాగలాండ్తో జరిగిన చివరి రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్లో ఆంధ్ర జట్టును నాకౌట్ దశకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ సీఆర్ జ్ఞానేశ్వర్కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అజేయ ద్విశతకం 248 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసిన జ్ఞానేశ్వర్, ఒత్తిడిలోనూ ఆంధ్ర జట్టుకు విజయదిశ చూపించారు. మాజీ చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ చైర్మన్ సీఆర్ రాజన్ చిన్న కుమారుడైన జ్ఞానేశ్వర్ ఈ ఇన్నింగ్స్తో తెలుగు రాష్ట్రాల్లో క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించారు.ఆయన ప్రదర్శనతో ఆంధ్ర జట్టు నాకౌట్ స్టేజ్కు అర్హత సాధించగా, రాజకీయ, సామాజిక, క్రీడా వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. తిరుచానూరు గ్రామ ప్రజలు జ్ఞానేశ్వర్ కు అభినందనలు తెలిపారు.



## అవ్వాతాతలకు ముఖాల్లో ఆనందమే కూటమి లక్ష్యం

- 'మారెళ్ల సొసైటీ చైర్మన్ వై.వి ప్రభాకర్ రెడ్డి
- 'టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు

**తుగ్గలి, జనవరి 31(మనం న్యూస్):** ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న ఈ చిరునవ్వే మా కూటమి ప్రభుత్వ అసలైన విజయమని మారెళ్ల సొసైటీ చైర్మన్ వై.వి ప్రభాకర్ రెడ్డి ,టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు. రాంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్ ఆదేశాలు మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించి,వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం, అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మ లకు పెంచిన పింఛన్ మొత్తాన్ని వారి చేతుల్లో పెట్టడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడమే మా లక్ష్యమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వెల్ఫేర్ అసిస్టెంట్ పులిరాజు, స్థానిక టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



- తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

**తిరుపతి, జనవరి 31 మనం న్యూస్:** శేషాచలం ప్రాంతంలో అరుదైన జాతి సంపదగా గుర్తింపబడిన ఎర్రచందనం దుంగలను ఇక్కడి నుండి అక్రమ మార్గాలలో రాష్ట్రాలు దాటించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో త్రిముఖ చర్యలతో స్మగ్లర్లను పూర్తిస్థాయిలో నిలువరించడానికి పక్కా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు స్పష్టం చేశారు. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం దుంగలు అక్రమ మార్గంలో తెప్పించుకుని నకిలీ ప్రభుత్వ అనుమతి పత్రాలను సృష్టించి ఎక్కువ ధరలకు చైనా దేశానికి ఎగుమతి చేస్తున్న అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ ను ప్రత్యేక వ్యూహంతో బలగాలను బృందాలుగా ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ అధికారులతో అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ అరెస్టు వివరాలను వెల్లడించారు.

సదరు మొహమ్మద్ ముజామిల్ లైసెన్సు పేరుతో ఎర్రచందనం దుంగలను చైనా దేశానికి ఇగుమతి చేస్తూ భారీగా అక్రమార్జన పొందాడని, శేషాచల అడవులలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ముద్దాయిగా ఉంటూ పరారీలో ఉన్నాడన్నారు. ఇతనిపై గత ఏడాది 60/2025 క్రైమ్ నెంబర్ టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యిందన్నారు. పక్కా ప్రణాళికను రచించి అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ ను చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారి తనపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన మొహమ్మద్ ముజామిల్ కు ఎర్రచందనం స్మగ్లర్ అయిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సెట్టు, సేటు భాయ్, వాజీబ్ మరికొందరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించడమే కాకుండా తక్కువ ధరలకు కొనుగోలు చేసి బెంగళూరుకు చెందిన రవి అనే వ్యక్తి ద్వారా రైతుల నుండి ఎర్రచందనం కొనుగోలు చేసినట్లుగా ప్రభుత్వ అనుమతులు పొంది చైనా దేశానికి అక్రమ రవాణా చేస్తూ అధిక లాభాలను పొందుతున్నారన్నారు.

చైనాకు చెందిన జో జో ఎర్రచందనం అక్రమ రవాణాలో మొహమ్మద్ ముజామిల్ కు సహకరిస్తున్న చైనా దేశానికి చెందిన జో జో అనే మహిళ గ్జియామెన్ ట్యాంగాంగ్ఫంగ్ ట్రేడ్ కో లిమిటెడ్ అను కంపెనీ తరఫున భారతదేశంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేసే ప్రతినిధిగా ఉన్న మైఖేల్ పాత్రలపై లోతైన దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలను తీసుకోవడం జరుగుతుందని సుబ్బరాయుడు స్పష్టం చేశారు. శేషాచలం అడవుల నుండి పూర్తిస్థాయిలో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా నిలువరించడానికి టాస్క్ ఫోర్స్ త్రిముఖ చర్యలను అమలు చేస్తోందని తెలిపారు.

ఇందులో భాగంగా అక్రమ రవాణా కేసులకు సంబంధించి కోర్టు ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయడం, సాక్షులను న్యాయస్థానం ముందు హాజరపరిచి అక్రమ రవాణాలో నేరస్తులుగా ఉన్నవారికి శిక్షపడేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీని ఫలితంగా గత ఏడాది జనవరి నుండి ట్రైల్ జరిగిన 31 కేసులలో 27 కేసులలో శిక్ష పడి తద్వారా 87 శాతం ముద్దాయిలకు నేర నిరూపితమై న్యాయమూర్తి ద్వారా శిక్షలు విధింపబడ్డాయన్నారు.

## ఖబర్దార్ వైసీపీ నాయకులారా

# నోరు జాగ్రత్త

### అంబటి వ్యాఖ్యలపై కర్నూలు టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఫైర్



**ఆదోని, జనవరి 31(మనం న్యూస్):** మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిపై చేసిన అనుచిత, బాధ్యతారహిత వ్యాఖ్యలను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, వ్యక్తిగత దూషణలకే పరిమితమవడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల రాజకీయ దిగజారుడుకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు. ప్రజల కోసం దశాబ్దాలుగా పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడిపై అసభ్య పదజాలంతో దాడి చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించలేని వారు వ్యక్తిగత విమర్శలతో చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె విమర్శించారు. విమర్శలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉన్నప్పటికీ, అవి విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిత్వ హననం చేసేలా ఉండకూడదని స్పష్టం చేశారు.గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండటం ప్రతిపక్షానికి సహించని విషయం అయిందని ఆమె వ్యాఖ్యానించారు. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం ముందడుగు వేస్తుండటంతో రాజకీయంగా నిలదొక్కుకోలేని ప్రతిపక్ష నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని తెలిపారు. ఇకపై ఇలాంటి అసభ్య వ్యాఖ్యలను మానుకుని ప్రజల సమస్యలపై సానుకూల చర్చకు రావాలని వైసీపీ నాయకులకు గుడిసె ఆది కృష్ణమ్మ సూచించారు. లేకపోతే ప్రజలే తగిన సమయంలో సరైన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. రాష్ట్ర రాజకీయాల్లో సంస్కారం, విలువలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉందని ఆమె గుర్తు చేశారు.

## శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి రూ. 90 లక్షల విలువైన వైద్య పరికరాల విరాళం



**తిరుమల, జనవరి 31,మనం న్యూస్:** శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ముంబైకు చెందిన అల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి మధురిమ సింగ్ రూ. 90 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించారు. శనివారం ఉదయం ఈ పరికరాలను టిటిడి జేఈవో (ఆరోగ్యం విద్య) డా. ఎ. శరత్ కు అందజేశారు. దాత అందించిన పరికరాలలో హై ఎండ్ వెంటిలేటర్లు -4, పేషెంట్ మానిటర్లు - 4, హ్యూమిడిఫయర్లు - 4, హెచ్ఎఫ్ఎన్సీ (హై ఫ్లో నాసల్ కేన్యులా పరికరాలు) - 4 ఉన్నాయి. ఈ సందర్భంగా జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, చిన్నపిల్లల హృదయ చికిత్సలకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన చిల్డ్రన్స్ ఆసుపత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అల్కెమ్ ఫౌండేషన్ మరింత అభివృద్ధి సాధించాలని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహం లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధురిమ సింగ్ ను శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్, అల్కెమ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి కేసును సిట్ మరింత లోతుగా దర్యాప్తు చేయాలి

- ఈడీ ఈ కేసులో విచారణ జరపాలి
- పాలు లేకుండా నెయ్యి ఎలా వచ్చింది
- కింది స్థాయి వాళ్ళను పట్టుకువచ్చి, దోషులుగా చూపిస్తే సరిపోదు



**తిరుపతి, జనవరి 31 మనం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానాల్లో (టీటీడీ) చోటుచేసుకున్న కల్తీ నెయ్యి వ్యవహారంపై శాప్ చైర్మన్ రవినాయుడు తిరుపతిలోనీ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్ మీట్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్నదని పేర్కొంటూ, ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును మరింత లోతుగా, నిష్పక్షపాతంగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకమండలి హయాంలో జరిగిన 371 సవరణ ఎవరి కోసం, ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారనే అంశంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కల్తీ నెయ్యి కేసు విచారణను కేవలం పీఏ స్థాయి కే పరిమితం చేయడం సరికాదని, అసలు నిర్ణయాలు తీసుకున్న వారి వరకు విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వై వి సుబ్బారెడ్డి పిఎ దోషి అంటే సరిపోతుందా..? పీఏ కి ఏ అధికారం ఉందని దోషిగా చూపించారు..? బోర్డులో నిర్ణయం తీసుకునే అధికారం ఎవరికి ఉంది..?వారి వెనుక ఉన్న పెద్దలు ఎవరు? వారిపై కూడా విచారణ జరపాల్సిందేనని రవినాయుడు స్పష్టం చేశారు. ఛార్జ్‌షీట్లోని అంశాలను వైసీపీ నాయకులు ముందే ఎలా నిర్ధారిస్తున్నారు? అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

రాష్ట్రంలో ఏ గుడికి ఎంత నెయ్యి సరఫరా చేశారన్న అంశంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాలని, ఈ దారుణం కేవలం 250 కోట్ల రూపాయలకే పరిమితం కాలేదని తెలిపారు. పాలు లేకుండానే నెయ్యి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వైసిపి నేతలకు ఉందని కింది స్థాయి ఉద్యోగులను మాత్రమే బాధ్యులుగా చూపించి అసలు నిందితులను తప్పించేందుకు ప్రయత్నిస్తే అది ప్రజలను మోసం చేసినట్లేనని విమర్శించారు. టీటీడీలోని కొందరు అధికారులు, అప్పటి బోర్డులోని కొందరు సభ్యులు పరస్పరం కుమ్మక్కై ఈ తప్పిదానికి పాల్పడ్డారన్న అనుమానం బలంగా ఉందన్నారు. ఈ కేసులో ఈడీ (ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్) కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు చేసిన తప్పును ఒప్పుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన బదులు, దొంగ నాటకాలు ఆడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

చివరిగా ఈ మొత్తం కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రజల్లో ఉన్న అనుమానాలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కరుణాకర రెడ్డి లేదా ఆయన బంధువు సుబ్బారెడ్డి, అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైనే ఉందని రవినాయుడు స్పష్టం చేశారు. అదేవిధంగా, భక్తుల విశ్వాసానికి భంగం కలిగించిన ఈ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత, లోతైన విచారణ జరిపి, అసలు దోషులను శిక్షించాల్సిందేనని శాప్ చైర్మన్ రవినాయుడు గారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్,తోట వాసుదేవ,శ్రీధర్,కొట్టే హేమంత్ రాయల్,రంజిత్ నాయుడు, ప్రకాష్, మధు, హర్ష, దిలీప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డికి అపూర్వ స్వాగతం పలికిన పార్టీ నేతలు, కార్యకర్తలు

- ఏర్పేడు టోల్ ప్లాజా నుంచి 150 కార్లుతో భారీ ర్యాలీ
- అడుగడుగునా హారతులతో 3గంటల పాటు సాగిన ర్యాలీ
- తనపల్లి సర్కిల్ వద్ద స్వాగతం పలికిన భూమన

**చంద్రగిరి, జనవరి 31 మనం న్యూస్:** చంద్రగిరి ప్రజలు ఆరాధ్య నాయకుడు.. పిలిస్తే పలికే అభిమాన నాయకుడు చెవిరెడ్డి కి చంద్రగిరి ప్రజలు జేజేలు పలికారు.. చంద్రగిరి నియోజక వర్గం ప్రారంభమయ్యే చోటు వద్ద వేలాది మంది జనం నిలబడి గజ మాలలు, గుమ్మడి కాయలతో దిష్టి తీసి సాదరంగా స్వాగతం పలికారు.. జాతీయ రహదారిపై వందలాది వాహనాలు నడుమ చెవిరెడ్డి కాన్వాయ్ ముందుకు కేందలగా ప్రధాన కూడళ్లలో ఆయనకు సాదర స్వాగతం పలికారు.. చంద్రగిరి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. గత ఏడాది జూన్ 18వ తేదీన అక్రమ కేసులో అరెస్టు చేసి విజయవాడ జిల్లా జైలులో 226 రోజులుగా నిర్బంధించారు. అనంతరం హైకోర్టు ఇచ్చిన బెయిల్ మీద బయటకు వచ్చిన చెవిరెడ్డి సుదీర్ఘ విరామం తరువాత చంద్రగిరి నియోజక వర్గంలో అడుగుపెట్టారు. చెవిరెడ్డి నుంచి చూసేందుకు జనం స్వచ్ఛందంగా తరలి రాగా నిర్దేశించిన ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి సాదరంగా చెవిరెడ్డికి స్వాగతం పలికారు.



**చెవిరెడ్డికి జన నీరాజనం.**

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పై విడుదలై వస్తున్నారని తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. జాతీయ రహదారికి ఆనుకుని వున్న పల్లెల్లోని జనం హారతులతో నీరాజనం పలికారు. చేరుకుని చెవిరెడ్డి కీ నీరాజనం పలికారు. చెవిరెడ్డికి జై కొడుతూ పలువురు మహిళలు మా అన్న వచ్చాడు మాకు భయం లేదంటూ ఆనందంతో చిందులు వేయడం విశేషం.

**టోల్ ప్లాజా నుంచి 150 కార్లుతో ర్యాలీ**

ఏర్పేడు టోల్ ప్లాజా నుంచి 150 కార్లు ర్యాలీగా రాగా దామినేడు నుంచి 250బైక్ లతో యువత ర్యాలీ చేశారు. చంద్రగిరి ప్రజలకు పదేళ్ల పాటు అన్నీ తానై చూసిన చెవిరెడ్డి నుంచి అక్రమంగా ఎనిమిది నెలల పాటు జైలులో నిర్బంధించడం తట్టుకోలేని జనం రోడ్లపై బారులు తీరి ఆయనకు స్వాగతం పలికారు.

**తణపల్లి క్రాస్ లో భూమన స్వాగతం..**

జాతీయ రహదారిపై భారీ ర్యాలీగా వస్తున్న చెవిరెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి తణపల్లి క్రాస్ వద్ద సాదర స్వాగతం పలికారు. తన రాజకీయ గురువు భూమనను చూడగానే చెవిరెడ్డి దిగివచ్చి నడిరోడ్డుపై పాద నమస్కారం చేశారు. అనంతరం చెవిరెడ్డిని హత్తుకున్న భూమన ఆత్మీయ పలకరింపుతో తన పోరాట పటిమకు అభినందనలు తెలిపారు.

**ప్రత్యేక ఆకర్షణగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

తన తండ్రి చెవిరెడ్డి వెనుక దండంపెట్టి అందరికీ అభివాదం చేస్తూ చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రజలు అందరికీ చెవిరెడ్డితో పాటు దండం పెడుతుండగా పార్టీ కార్యకర్తలు, నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినదించారు.

## పగ

అది ఏమైనాగాని
పగన్నది మదిలో ఒకటుంటే
పామున్న ఇంటిలో కాపురమున్నట్లే
ప్రతీకారం ఎదలో కలవరపెట్టిందా

నీ సమాధిని నువ్వు నిర్మించుకున్నట్లే!
నాకు తెలుసు
నీవెన్ని నిద్రలేని రాత్రులను
దిగమింగుతున్నావో

ఎన్ని భద్రతల మధ్య ఉన్నా
చుక్కలు లెక్కబెడుతున్న దృశ్యం
ఉదయం నీ ముఖం పట్టిస్తున్నది
ఎన్ని కలలు కన్నావో

నీ సుఖాన్ని బలిపెట్టి
నీకళ్ళకు అధికారం గంతలు కట్టి
అందరు నిన్ను ఊరేగిస్తుంటే
నీ లోపలి మనిషి ఒడ్డున పడ్డ చేప పిల్లనే!

నిన్ను ఇప్పుడెవరూ కాపాడలేరు
నీవు పెట్టిన ఆశలకు భ్రమపడ్డవాళ్ళు
ఏదో ఒక రోజున నిన్ను జనం సాక్షిగా
ఎత్తి కుదేస్తేగాని మైకం వదలదు

నోటిదురుసుతనం సాగినంతకాలమే
కాలం చూస్తూ ఉండగనే గడిచిపోతది
మాటల్ని చరిత్ర గుర్తుపెట్టుకుంటది
వినయం లేనిచోట జ్ఞానం నిలువదు!

అధికారం సంపద అంగబలం
సమూహంగా వచ్చి అట్లనే నిష్క్రమించేవి
శాశ్వతమనుకున్నావో
కాల పరీక్షకు నిలవాల్సిందే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# పోరు బిడ్డలు సమ్మక్క సారలమ్మలు

మేడారం ఆదివాసీ యుద్ధభూమి, ఆదివాసీల పోరు గద్దె మేడారం. ఏ పురాణాలు.. ఏ చరిత్ర కొనియాడని త్యాగ మూర్తులు ఈ వీరవనితలు సమ్మక్క సారలమ్మలు. ఆదివాసీలు తమ గుండెల్లో గుడి కట్టుకొని పూజిస్తున్న వీరవనితలు. తన జాతి కోసం నమ్ముకున్న విలువల కోసం ఆదివాసీ స్వయం పాలన కోసం తమ ప్రాణాలను త్యజించి మరణం తరువాత కూడ జనం గుండెల్లో బతకవచ్చు అని నిరూపించిన పోరు వనితలు ఈ సమ్మక్క సారలమ్మలు. కాకతీయుల పాలనపై కత్తులు దూసిన ఆదివాసీలు ఈ సమ్మక్క సారలమ్మలు. పరాయి పాలన నుంచి స్వేచ్ఛాయుతపాలన కోసం సమ్మక్క సారలమ్మలు పగడిద్దరాజులు కాకతీయుల సైన్యంతో పోరాడి ఆత్మత్యాగాలు చేశారు. ఇంతటి చారిత్రక సంస్కృతిక సాయుధ పోరాట చరిత్ర ఆదివాసీల మనోభావాలకు విలువ ఇవ్వలేదు. ఆదివాసీల చరిత్రను చరిత్రగా లిఖించలేదు.

పాలకులు కూడ పట్టించుకోలేదు. తెలంగాణలో ములుగు జిల్లాలో జరిగే మేడారం జాతర ప్రతి రెండెండ్లకొకసారి జరుగుతుంది. అది పోరుబిడ్డలు జాతర ఎవరూ అవునన్న కాదన్న సమ్మక్క సారాలమ్మ పగడిద్దరాజుల సంస్మరణ వేడుక. సమ్మక్క సారాలమ్మలుగా కొలవబడుతున్న ఆదివాసీ ముద్దు బిడ్డలు వారు. ఆదివాసీ తెగలో పుట్టిన ఉద్యమ దివిటీలు. సమ న్యాయం కోరుకున్న వీరవనితలు. ఆదివాసీ సంస్కృతికి సంప్రాదాయలకు దిక్సూచి ఈ జాతర. ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక మేడారం. గిరిజనేతర ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా ఈ మేడారం జాతర జరుగుతుంది. ఆదివాసీ అస్థిత్వానికి ఆయుధం ఆదివాసీ ఉద్యమాలకు ఊపిరి ఈ మేడారం జాతర. ఆదివాసీ అస్థిత్వం కోసం ఆదివాసీ స్వయంపాలన కోసం కాకతీయులపై కత్తులు దూసి కదనరంగంలో అమరులైనా ఆదివాసీ ముద్దు బిడ్డలు ఈ సమ్మక్క సారక్క జంపన్న పగడిద్దరాజులు. వారిని స్మరిస్తూ ఆదివాసీ సంప్రాదాయాల ప్రకారం ప్రతిరెండు సంవత్సరాల కొకసారిమేడారం పోరునేలపై జాతర పోరునేలపై జాతర రూపంలో వారిని అతిపవిత్రంగా కొలుస్తారు.స్మరిస్తారు. ఈ జాతర మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతిరూపంగా ఉంటుంది. కాకతీయ రాజు రుద్రదేవుడురాజ్య కాంక్షతో మేడారం పై దండెత్తాడు. వీరి మధ్య జరిగిన భీకరపోరులో పగడిద్దరాజు సమ్మక్క సారాలమ్మ గోవిందరాజులు వీరమరణం చెందారు. జంపన్న సంపెంగ వాగులో దూకి చనిపోయాడు. సమ్మక్క విరోచిత పోరాటం దాటికి తట్టుకోలేని శత్రువులు వెనక నుండి బల్లెంతో పొడిచారు. తీవ్రగాయలతో శత్రువులను హతమారుస్తు మేడారానికి తూర్పు దిశగా చిలకలగుట్ట వైపు సాగుతుసమ్మక్క అదృశ్యం అయింది. సమ్మక్క జాడ తెలియదు. ఆ తరువాత చిలకలగుట్టవద్ద పసుపు కుంకుమ బరిణేలతో ప్రత్యక్ష్యమైందని



ఒక నమ్మక్కం. సమ్మక్క, సారలమ్మలు దేవతలు కారు. ఈ నేల మీద మనలాగనే రక్తమాంసాలతో జీవించిన మనుషులు. వాళ్లు ఈ జంపన్న వాగు నీళ్లు తాగారు. ఈ అడవిలో ఆకులు ఆలములు తిన్నారు. ఈ జంపన్నవాగు ఒడ్డున్నే కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని సైన్యంతో వీరోచితంగా పోరాడారు.

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర స్థల పురాణాన్ని (స్థల పురాణం అనేది కూడ పాలకవర్గాలు తయారు చేసే అతిశయోక్తుల, అభూత కల్పనల కథ) నిశితంగా పరిశీలిస్తే, ఈ దేశంలో భూస్వామ్య, రాచరికవర్గాలు, మైదాన ప్రాంత రాజవంశాలు ఆదివాసుల మీద సాగించిన దమనకాండలను గుర్తు చేసుకుంటే ఈ కోయబిడ్డల కథను, చరిత్రను పునర్నిర్మించవచ్చు. సమ్మక్కను, సారలమ్మను ఎట్లా చూడాలో అర్థం చేసుకోవచ్చు.

తమమీద పోరాడిన జాతులను, తాము అణగదొక్కిన జాతులను మ్యూజియంలో ప్రదర్శన వస్తువులుగా చూపడం ప్రపంచవ్యాప్తంగా అన్ని పాలక వర్గాలూ అనుసరించే నీతే. చరిత్రలో వెనక్కుపోయిన కొద్దీ ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా కనబడతాయి. కాని సమీపగతంలోని వీరుల గురించి ఇట్లా ప్రవర్తించడం అంతగా సాధ్యంకాదు. అందుకే ఆ వీరులను పొగిడి, మర్యాదస్తులుగా మార్చేస్తారు. ఆ వీరులు బతికి ఉండి పోరాటాలు నడిపిన రోజులలో వారిని అణచివేసిన వాళ్లే, వారిని చంపిన వాళ్లే ఆ వీరులను కీర్తించడం మొదలు పెడతారు. భగత్‌సింగ్‌కు, అల్లూరి సీతారామరాజుకు, చివరికి శ్రీకాకుళం విప్లవోద్యమ నాయకులు సత్యం, కైలాసంలకు కూడ ఇటువంటి 'పొగడ్తలు' అందాయి.

ఈ సంస్మరణ ఏడు వందల సంవత్సరాల కిందటి సమ్మక్క, సారలమ్మల పోరాట స్ఫూర్తిది మాత్రమే కాదు. మూడు దశాబ్దాలుగా ఈ గోదావరి తీరంలోనే నిర్మాణమవుతున్న విప్లవోద్యమ యోధుల సంస్మరణ కూడ. ఆ యోధులలో మనలో నుంచే పోరాటంలో ప్రవేశించి ప్రాణత్యాగం చేసిన అడవి బిడ్డలు న్నారు. ఈ నేలమీద మనిషిని మనిషి దోపిడీ చేయడానికి వీలు లేని సమాజాన్ని కలగంటూ ఆ కల కోసం ప్రాణత్యాగం చేసిన ఈ ప్రాంత కష్టజీవుల బిడ్డలున్నారు. నిజంగా తరతరాలుగా సమ్మక్కను, సారలమ్మను కొలవడంలో పీడిత ప్రజలందరమూ ఐక్యంగా ఉన్నాం. వాళ్లు పీడిత ప్రజా పోరాటయోధులు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న వీరులను కూడా సంస్మరించుకుంటూ, ఈ సంస్మరణను వక్రీకరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్క ృతులను ఓడిద్దాం.

ఏదో ఒక పేరుతో ఆదివాసీలను అడవినుండి వెళ్ళగొట్టలానే కుట్రలు కుతంత్రాలతో పాలకులు పొమ్మనకుండా పొగ పెడుతున్నారు. ఇక్కడజాతర విషయంలో గిరిజనేతర పార్టీలు అనేక అడ్డంకులు సృష్టిస్తూ ఆధిపత్యం చెలాయిస్తు మేడారాన్ని కబ్జా చేయాలనే కుతంత్రానికి తెర లేపుతున్నారు. మేడారానికి అంతర్జాతీయ ఖ్యాతి రానుండటంతో జాతరపై కార్పోరేట్ కన్ను పడింది. అసలు మేడారం జాతర నేపథ్యాన్ని సమ్మక్క స్వయం పాలన సాయుధపోరాట చరిత్రను పుస్తక రూపంలో పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవసరం ఉందని ఆదివాసీ మేధావులు అంటున్నారు. మరీ ముఖ్యంగా వీరనారీమణుల్ని దేవతలుగా ప్రచారం చేయడంతో ప్రజల్ని అంధవిశ్వాసాల్లో ముంచి ఎదగకుండా చేస్తోంది. అది చాలా ప్రమాదం!

కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడిపై సమరం సాగించిన సమ్మక్క రాణి సారలక్క రాణి, మేడరాజుల చరిత్రని అంతం చేసి వారిని కేవలం దేవతలుగా, దేవుళ్లుగా, ఉత్సవ విగ్రహాలుగా బెల్లంసారా,కల్లు, కోళ్ళు,యాటల్ని సమర్పించుకొనే, ముడుపులు ఇచ్చుకొనే దేవతలుగా మార్చి జాతర చేసుకొనేటట్లు చేసి ఆదివాసుల చరిత్రను పాతరేసారు.

ఆదివాసులు తమ స్వయం పాలన సాయుధ పోరాట చరిత్రనూ తెలుసుకోవాలి. కాకతీయ రాజుల వారసుల్ని ఓడించటం - తిరిగి తమ ఆదివాసీ స్వయం పాలనను స్థాపించుకోవటం అదే తమ స్వధర్మ యుద్ధం కావాలి నేడు. అప్పుడు మాత్రమే ఈ మేడారం జాతరలో సమ్మక్క సారలమ్మ రాణిల సమర గాధను అక్షరబద్ధం చేసి, దానిని రాతిశాసనాలపై చెక్కించటం సాధ్యమవుతుంది. అది చరిత్రగా ఈ భూమి ఉన్నంత కాలం ఉంటుంది. మనం రాసుకునేంత వరకు ఈ పాలకులు మన చరిత్రను శాసనబద్ధం చేయరు. ఆదివాసీలు ఆధిపత్య సంస్కృతులను సవాల్ చేస్తు ప్రత్యామ్నాయ సంస్కృతులన రూపొందించుకునే క్రమానికి స్థానిక ఆదివాసీ సమాజం ఎదిగింది. అందుకే ప్రకృతికి తప్ప మరో మనిషి ముందు సాగిలపడే సంస్కృతి ఆదివాసీ సమాజంలో లేదు. పాలకులవర్గాలు పెత్తనం పెరిగిపోతే సమ్మక్క సారలమ్మలు కోయజాతికి దూరం అవుతారు. సమ్మక్క సారలమ్మలను హిందు దేవతలుగా గుర్తించే కుట్ర జరుగుతుంది. ఆదివాసీలు ఎంతతో భక్తిశ్రద్ధలతో జరిపే మేడారం జాతరను కబ్జా చేయాలని లంబాడీలు గిరిజనేతర శక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఆదివాసీలు రిజర్వేషన్‌లో పాటుగా ఆదివాసీల సంస్కృతిని సైతం కబలించాలనే కుట్రలకు తెర లేపుతున్నారు. కాకతీయులపై కత్తులు దూసి కదన రంగంలో అమరులైనా సమ్మక్క సారలమ్మ విప్లవ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని గిరిజనేతర సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి మేడారం జాతరను కాపాడుకోవాలి. మేడారం జాతరపై పాలకుల ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలి.

**- పూకె రామకృష్ణ దొర**
9866073866

# ఈ సారైనా బడ్జెట్ మేలు చేస్తుందా?

ఇల్లు కడితే పునాది గట్టిగా ఉండాలి అంటారు. దేశాన్ని నడిపే ఆర్థిక పునాది బడ్జెట్. కానీ నేటి బడ్జెట్లు పునాదులు బలమైన నిర్మాణం కోసం కాకుండా పై అంతస్తులు అలంకరించడమే లక్ష్యంగా మారాయి. కేంద్ర బడ్జెట్ అనేది కేవలం ఆదాయ వ్యయాల లెక్కల సమాహారం కాదు. అది ఒక దేశం తన ప్రజల పట్ల చూపించే నిబద్ధతకు అద్దం. ఒక ప్రభుత్వం ఏ వర్గాన్ని, ఏ రంగాన్ని కేంద్రంగా పెట్టుకుని పాలన చేస్తోందో, ఏ సమస్యలను జాతీయ ప్రాధాన్యంగా భావిస్తోందో, ఏ బాధలను నిర్లక్ష్యం చేస్తోందో బడ్జెట్ పేజీలలో స్పష్టంగా కనిపిస్తుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌పై దేశ వ్యాప్తంగా అంచనాలు పెరిగాయి. దేశం ప్రస్తుతం ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభాల సమాహారం. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ఆరోగ్య విద్య రంగాల పతనం, రాష్ట్రాల ఆర్థిక స్వాయత్తతపై దాడులు ఇవన్నీ బడ్జెట్కి ముందు ప్రజల మనసులో తిరిగే ప్రశ్నలు. కేంద్ర బడ్జెట్ 2026-27పై దేశమంతా దృష్టి పెట్టడానికి కారణం ఇది ఆర్థిక ప్రకటన కాదు బాధల్లో ఉన్న ప్రజలకు బడ్జెట్ సంఖ్యలు ఓదార్పునిస్తాయి. కానీ ఆ సంఖ్యల వెనుక ప్రజల కన్నీళ్లు కనిపించకపోతే అది ఆర్థిక పాలన కాదు అది లెక్కల దౌర్జన్యం.

2025-26 కేంద్ర బడ్జెట్‌ను ప్రభుత్వం వికసిత భారత్‌గా ప్రచారం చేసింది. మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఎకానమీ, రైల్వేలు, రహదారులు, రక్షణ రంగం వంటి అంశాలపై భారీ కేటాయింపులు చేశామని చెప్పుకుంది.

ఆ బడ్జెట్ ప్రజల జీవి తాల్లో ఎంత మార్పు తీసుకొచ్చింది? నిరుద్యోగ యువతకు ఎంత మంది ఉద్యోగాలు వచ్చాయి? రైతుల ఆదాయం ఎంత పెరిగింది?చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంత బలపడ్డాయి? ఈ ప్రశ్న లకు సమాధానాలు ఆశించిన స్థాయిలో లేవు. జిడిపి వృద్ధి శాతం చెప్పుకునే ప్రభుత్వానికి, ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న వాస్తవం చూసాం. ప్రభుత్వం ప్రతి వేదికపై భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. భారత్ ప్రపంచంలో వేగంగా అభి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని చెపుతుంది. స్టాక్ మార్కెట్ బలంగా ఉంది. కార్పొరేట్ లాభాలు బలంగా ఉన్నాయి.

కొద్ది మంది సంపద బలంగా ఉంది. గ్రామీణ భారతం కొనుగోలు శక్తి తగ్గింది. మధ్య తరగతి ఈఎంఐ ల మధ్య నలిగిపోతోంది. 2025-26లో ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని అధికారిక గణాంకాలు చెప్పినప్పటికి. వంటనూనె, బియ్యం, పప్పులు, కూరగాయలు, పాల ఉత్పత్తులు అన్నీ సామాన్యుడికి అందని ధరలకు చేరాయి. బడ్జెట్‌లో సబ్సిడీల తగ్గింపు, ఇంధన పన్నులపై స్పష్టత లేకపోవడం ద్రవ్యో ల్బణాన్ని మరింత పెంచింది. 2026-27 బడ్జె ట్‌పై ప్రజల ఆశ కనీసం నిత్యావసరాలపై పన్నుల భారం తగ్గించాలి. కానీ ప్రభుత్వం ఆదాయ లోటును పూడ్చుకోవడానికి పరోక్ష పన్నుల మీదే ఆధారపడితే, ఈ ఆశ నెరవేరే అవకాశం ఎంత? ఉద్యోగ కల్పన అనే పదం అనేకసార్లు వినిపిం చింది. స్టార్టప్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్, ముద్ర రుణాలు వంటి పథకాలు ప్రస్తావించబడ్డాయి.

వాస్తవంగా ప్రభుత్వ రంగ నియామకాలు తగ్గాయి. భద్రత లేని కాంట్రాక్ట్ విధానం, ప్రైవేట్ రంగంలో అస్థిర ఉద్యోగాలు పెరిగాయి. రైతు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అంటూనే 2025-26 బడ్జెట్లో వ్యవసాయానికి పెద్దగా ఒరిగిందేమి లేదు. ఎరువుల కొరత మరియు ధరలు పెరిగాయి. రైతు ఆదాయం రెట్టింపు అనే లక్ష్యం మాటలకే పరిమితమై కార్పొరేట్ అనుకూల విధానాల మధ్య రైతు నిలువలేకపోతున్నాడు.గత బడ్జెట్లో ఆదాయపు పన్ను స్లాబ్‌లపై కొంత సడలింపు ఇచ్చినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ పెరిగిన GST, ఇంధన పన్నులు, విద్య ఆరోగ్య ఖర్చులు మధ్యతరగతి మీద భారంగా మారాయి. పన్ను చెల్లింపుదారుడిగా మధ్యతరగతి ప్రభుత్వానికి అవసరం. కానీ సంక్షేమ పథకాల ఫలితాల్లో మాత్రం ఈ వర్గం ఎప్పుడూ పక్కకు నెట్టబడుతుంది. గత బడ్జెట్‌లో విద్య ఆరోగ్య రంగాలకు కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవు. ప్రభుత్వ పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో నలిగిపోతున్నాయి.

ప్రైవేటీకరణ వేగంగా సాగుతోంది. సంపాదించే సగం మొత్తం కార్పొరేట్ అస్పత్రులకే ఆరోగ్యం కొరకు చెల్లిస్తున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని 2026-27 బడ్జెనైనా విద్య, ఆరోగ్యాన్ని మౌలిక హక్కుగా చూసి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి. గత బడ్జెట్లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే వాటా, జీఎస్టీ పరిహారం అంశాల్లో అస్పష్టత కనిపించింది. కేంద్రం ఆర్థిక అధికారా లను కేంద్రీకరిస్తోంది అనే విమర్శలు పెరిగాయి. కాబట్టి ఈ ఆర్థిక బడ్జెట్ ఎలా ఉండబోతుందోనని రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి.గత బడ్జెట్లో పెట్టుబడులు వస్తాయని కార్పొరేట్ పన్నులపై సడలింపులు కొనసాగాయి. కానీ ఆ పెట్టుబడులు అనుకున్నంత ఉద్యోగాలు సృష్టించలేదు? కాబట్టి కార్పొరేట్ పన్నుల రాయితీలే కాక అట్టడుగు, మధ్యతరగతి ప్రజల అవసరతలను గుర్తించాలి. ప్రజలు బడ్జెట్ను తమ జీవితం మెరుగుపడే సాధనంగా చూస్తారు. కాబట్టి పాలకులు ఏనుగుకు ఆహారం, చీమకు ఉపవాసం అన్నట్లు రాజకీయ వ్యూహంగా చూడకుండా 2026-27 బడ్జెట్లో మధ్యతరగతి కి అనుకూలంగా, వేతన జీవులకు పన్ను పరిమితులు పెంచి, జీవన వ్యయాలకు తగ్గట్టుగా ప్రజల వాస్తవ అవసరాలను గుర్తిం చేదిగా, సామాజిక న్యాయాన్ని కేంద్రంగా చేసుకొని బడ్జెట్ కేటాయింపులు ఉంటే ప్రజల మన్ననలు పొంది చరిత్రలో నిలిచేదిగా ఉండాలని కోరు కుందాం.

**- దుప్పటి. మొగిలి**
8466827118






# ..వారికి సింహస్వప్నం 'రాయ్'



'మీ మీద, మీ సామర్థ్యం మీద నమ్మకం ఉంచండి. సమాజంలో మార్పు తెచ్చే సత్తా మీలో ఉంది. అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించండి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడండి' అని ఒక పెద్దాయన స్వాతంత్ర్య సమరంలో అప్పటి ప్రజలకు పిలుపునిచ్చారు. 'నాపై పడిన ప్రతి దెబ్బ బ్రిటిష్ సామ్రాజ్యవాద శవపేటికలో ఒక్కో మేకు వంటిది. నేను జీవించి ఉంటానో లేదో తెలియదు కానీ, నా తర్వాత నా ఆత్మ స్వేచ్ఛ కోసం మరిన్ని త్యాగాలు చేయమని మిమ్మల్ని ప్రోత్సహిస్తూనే ఉంటుంది' అని అన్నారు. జాతీయవాద భావానికి తనదైన ముద్రను, కొత్త అర్థాన్ని ఇచ్చి జాతీయోద్యమాన్ని మలుపు తిప్పారు. 'దేశభక్తి అంటే స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన ప్రేమ, ఆత్మగౌరవం కలిగి ఉండటమే' అని ఆయన చాటిచెప్పారు. ఆయనే అతివాద ఉద్యమానికి ఊపిరి పోయడానికి తమ ప్రాణాలనే బలిపెట్టిన 'లాల్-బాల్-పాల్' త్రయంలో ఒకరైన లాలా లాజపతిరాయ్.

లాలా లాజపతిరాయ్ 1865 జనవరి 28న పంజాబ్‌లోని 'ధుడికే' గ్రామంలో రాధా కిషన్, గులాబ్ దేవి దంపతులకు జన్మించారు. పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, ప్రసంగించడంపై మక్కువ పెంచుకున్నారు. పాఠ్యేతర అంశాల్లో ఆసక్తి చూపుతూ చిన్ననాడే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు.

1886లో హిసార్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, చురామణితో కలిసి హిసార్ బార్ కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఆర్యసమాజ్ జిల్లా శాఖను కూడా స్థాపించారు. భారతదేశ రాజకీయ విధానాన్ని రూపొందించడానికి జర్నలిజాన్ని ఒక సాధనంగా ఎంచుకున్నారు. 'ది ట్రిబ్యూన్'తో సహా అనేక పత్రికలకు రెగ్యులర్ కంట్రిబ్యూటర్‌గా ఉండేవారు. 1905లో కాంగ్రెస్ కమిటీ ఆయన అంకితభావాన్ని గుర్తించి, భారత ప్రజల రాజకీయ సమస్యలను బ్రిటిష్ వారి ముందు ఉంచేందుకు ప్రతినిధిగా ఎంపిక చేసింది. గోపాలకృష్ణ గోఖలేతో కలిసి ఇంగ్లాండ్‌లో రాజకీయ ప్రచారం నిర్వహించి, అప్పటి నిరంకుశ ప్రభుత్వ దురాచారాలను బ్రిటిషర్ల దృష్టికి తీసుకువెళ్లారు.

1920 కలకత్తా ప్రత్యేక సెషన్‌లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కుల వ్యవస్థ, స్త్రీల స్థితిగతులు, అంటరానితనం వంటి అంశాలపై హిందూ సమాజం అంతర్గత పోరాటం చేయాలని ఆకాంక్షించారు. కుల, లింగ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ వేదాలను చదవాలని విశ్వసించారు.

జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ ఆమోదిం చింది. 1921లో అరెస్టయి ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. రాయ్ రాజకీయ వేత్త, సామాజిక కార్యకర్త, రచయిత, పరోపకారి. 1896, 1899-1900 కరువులు, 1905 భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అలుపెరగని సేవ చేశారు. అణగారిన వర్గాల కోసం, అనాథ పిల్లల కోసం నిధులను సేకరించి పాఠశాలలు, అనాథాశ్రమాలు నిర్మించారు. సంఘసంస్కర్తగా అంటరానితనం నిర్మూలనకు ఆర్యసమాజ్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇచ్చారు. గాంధీజీ స్థాపించిన 'హరిజన సేవక్ సంఘ్'లో చేరి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. రచయితగా మజ్జినీ, గరీబాల్డి, శివాజీ, స్వామి దయానంద్ వంటి వారి జీవిత చరిత్రలను రాసి ముద్రించారు. పంజాబ్‌ప్రజలలోఅమితమైన ఆదరణ పొందారు. ఇది గిట్టని బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను విప్లవ కారుడిగా ముద్ర వేసింది. అహింసా యు త నిరసన ప్రదర్శనకు రాయ్ నాయకత్వం వహించారు. పోలీస్ అధికారి జేమ్స్ స్కాట్ స్వయంగా రాయ్‌పై దాడి చేశారు. ఆ గాయాల నుండి కోలుకోలేక 1928 నవంబర్ 17న పరమపదించారు.

**- జనక మోహన రావు దుంగ**
8247045230


# సూరజ్‌కుండ్‌లో అంతర్జాతీయ హస్తకళల ప్రదర్శన



1987లో ఘనంగా ప్రారంభమైన భారత హస్తకళల ప్రదర్శన మేళా నేడు 39వ పర్యాయం 31 జనవరి నుంచి 15 ఫిబ్రవరి 2026 వరకు ఒక పక్షం పాటు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాదు సమీపాల సూరజ్‌కుండ్ ప్రాంతంలో ప్రతి ఏట ఫిబ్రవరిలో నిర్వహించే పక్షకాలపు అంతర్జాతీయ స్థాయి క్రాఫ్ట్స్ మేళాలో వైవిధ్యభరిత భారతీయ ప్రజలతో పాటు 45 - 50 దేశాల హస్తకళలు, కళాకారులు, అధికారులు పాల్గొనడంతో పాటు 15 రోజుల పాటు మిలియన్ల కొద్ది ప్రజలు పాల్గొని తమ నైపుణ్యాలకు తగు గుర్తింపును, కళారూపాల అమ్మకాలు జరుగుతాయి. ఈ మేళాలో హస్తకళల వస్తు ప్రదర్శనలతో పాటుగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన కళాకారులుతో కలిసి అంతర్జాతీయ కళాకారులు కూడా తమ తమ సాంప్రదాయ సాంస్కృతిక కళలను భారీ వేదికల మీదుగా ప్రదర్శించడం, వివిధ రకాల వంటలను పరిచయం చేయడం, వినోద కార్యక్రమాలు, సాహసక్రీడలు, నవ్య వాహన అనుభవాలు చూపరులను ఆకర్షిస్తూ పెద్ద ఎత్తున పలు కార్స్రక్రమాలు కొనసాగుతాయి.

**భారతీయ హస్త కళారూపాల ప్రదర్శన**

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో చవకగా వస్త్రాలను యంత్రాల సహాయంతో తయారు చేస్తూ మార్కెట్లోకి విసురుతున్న వేళ సాంప్రదాయ హస్తకళాకారులు తయారు చేస్తున్న వస్తువులకు గిరాకీ తగ్గడంతో భారతీయ హస్తకళాకారుల కుటుంబాలు ఆకలి కేకలతో అలవటిస్తున్నాయి. దీనికి ఒక విరుగుడు ప్రయత్నంగా గ్రామీణ సంప్రదాయ కళారూపాలు, హస్తకళల అందమైన వస్తువులను బయటి ప్రపంచానికి పరిచయం చేయడం, విక్రయాలు జరగడంతో మధ్యవర్తులు



లేకుండా నేరుగా హస్తకళాకారులకు ఆర్థిక లబ్ధి జరిగే విధంగా సూరజ్‌కుండ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. దాదాపు 50 ఎకరాల సువిశాల ప్రాంగణంలో వెయ్యికి పైగా దుకాణాలు లేదా స్టాల్స్‌తో ఏర్పాటు చేస్తున్న సూరజ్‌కుండ్ హస్తకళల మేళాలో వస్త్రాలు, పేయింటింగ్స్, కర్ర వస్తువులు, మట్టి పాత్రలు లేదా కళారూపాలు, శిల్ప కళారూపాలు, వెదురుతో చేసిన వస్తువులు లాంటి మరెన్నో వస్తువుల ప్రదర్శనలకు వేదిక కానుంది ఈ సూరజ్‌కుండ్.

**సూరజ్‌కుండ్ మేళా-2026 విశేషాలు**

సూరజ్‌కుండ్ మేళా అథారిటీ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వ టూరిజమ్, టెక్స్‌టైల్స్, కల్చర్, విదేశాంగ మంత్రిత్వశాఖల సౌజన్యంతో నిర్వహించే సూరజ్‌కుండ్ అంతర్జాతీయ క్రాఫ్ట్స్ మేళా - 2026లో యూపీ, మేఘాలయా రాష్ట్రాల ఇతివృత్తాలతో తోపుల ఉత్పత్తులు, కళాకారుల కేంద్ర బిందువుగా సాంస్క ృతిక, హస్తకళల, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రదర్శనశాలను సందర్శించిన వారికి అరుదైన హస్తకళల వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, పేయింటింగ్స్ లాంటివి తిలకించడం, కొనడం, కళాకారులతో మాట్లాడడం, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడం, హస్త కళాకారుల నైపుణ్యాలను నేరుగా చూడడం కొనసాగుతుంది. 2026 సూరజ్‌కుండ్ మేళాను పర్యావరణహిత ఏర్పాట్లతో చురుకుగా జరిగాయి.

వ్యర్థాలను తగ్గించడం, హరితసంచుల వాడకం, శుభ్రత పాటించడం, పర్యావరణ సుస్థిర విధానాలను అవలంబించడం కూడా జరుగుతూ కార్బన్ ఉద్గారాలను పూర్తిగా తగ్గించేలా ప్రయత్నాలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన సువిశాల భారతంలో దాగిన హస్తకళాకారులను ప్రోత్సహించడానికి సూరజ్ కుండ్ మేళాకు హాజరై వివిధ కళా రూపాలను కొని, పేద కళాకారులను ఆదుకుందాం, వారి ముఖాల్లో ఆనంద తాండవాలను చూద్దాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# తెలుగు ప్రజల ఆరాధ్య దైవం అన్న ఎన్టీఆర్

- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్



భీమవరం, జనవరి 31 (మనం న్యూస్)ః తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి బడుగు బలహీన, అట్టడుగు వర్గాలకు రాజకీయ పదవులు, సంక్షేమ ఫలాలు లభించేలా పరిపాలన చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆరాధ్య దైవమని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గోలగాని రమేష్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగుప్రజల ఆరాధ్యదైవం అన్న ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గొలగాని రమేష్ ను అభినందించారు. పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలో తీసుకువచ్చిన మొట్టమొదటి రాజకీయ నాయకుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగురాష్ట్రాలతో పాటు భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలను ఏకంచేస్తూ నేషనల్ ఫ్రంట్ నెలకొల్పి కాంగ్రెస్ పార్టీని గద్దె దింపిన అన్న ఎన్టీఆర్ అడుగుజాడలలో మనమంతా నడుచుకోవాలన్నారు. ముఖ్య అతిధులను గొలగాని రమేష్ గజమాల సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక 6 వార్డు బొక్కవారిపాలెం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారథి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెండ్ర శ్రీనివాస్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, ఏఎంసి చైర్మన్ కలిదిండి సుజాతరామచంద్రరాజు, ఇందుకూరి రామలింగరాజు వీరవల్లి దుర్గభవాని చంద్రశేఖర్, మేరగాని నారాయణమ్మ, గంటా త్రిమూర్తులు ఉప్పులూరి చంద్ర శేఖర్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పించన్లతో సామాజిక భద్రత

- జిల్లాలో 2,27,933 మంది లబ్ధిదారులకు రూ. 98.42 కోట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ



విజయవాడ సెంట్రల్, జనవరి 31 (మనం న్యూస్)ః ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా అర్హులైన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తదితరులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతను కల్పిస్తోందని, పథకాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంత అమలుచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం 64వ డివిజన్ కండ్రికలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పాల్గొన్నారు. పింఛనుదారులకు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛనుమొత్తాన్ని అందిస్తున్న తీరును పరిశీలించారు. లబ్ధిదారులైన వయోవృద్ధులను ఆత్మీయంగా పలకరించి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేదలకు వరమని.సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఈ సహాయం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 2,27,933 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 98.42 కోట్ల మేర పంపిణీ చేయడం జరుగుతోందని.ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంటోందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నరు కార్యక్రమంలో 64 డివిజన్ అధ్యక్షులు కే రవికుమార్ పాల్గొన్నారు.

## క్రీడల్లో స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ



నరసాపురం, జనవరి 31 (మనం న్యూస్)ఃనరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో డీఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి లంకె రాజేష్ జనవరి 28, 30 వ తేదీలలో తిరుపతిలో నిర్వహించిన ఐపిజిఎస్ ఎం -25 రాష్ట్రస్థాయి క్రీడలలో విశేష ప్రతిభ కనబరిచి లాంగ్ జంప్ విభాగంలో మొదటి స్థానం సాధించినట్లు సంపాదించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ కిరణ్మయి, కళాశాల పీడి కెవివిఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె వి సత్యనారాయణ (కేవిఎస్), కోశాధికారి కె.వి. స్వామి, డైరక్టర్ అడ్డాల శ్రీహరి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. గోపీచంద్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది లాంగ్ జంపులో ప్రథమ స్థానం సాధించిన లంకె రాజేష్ కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాజేష్ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# పేదల ఇళ్లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ఆనందం



- ఎం.ఏ షరీఫ్, పొత్తూరి రామరాజు

నరసాపురం, జనవరి 31 (మనం న్యూస్)ః పేదలు, వృద్ధులు, దివ్యాంగులు వితంతువులు, డయాల సిస్ పేషెట్లకు, అర్హులైన ఇతర లబదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ద్వారా లక్షల కుటుంబాలలో వెలుగులు నింపుతుందని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. పట్టణంలోని15 వ వార్డులో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమ పాలనకు తమ ప్రభుత్వం సజీవ సాక్ష్యం అని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ఎందరో జీవితాలలో వెలుగు నింపుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1వ తేదీ సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీని చేపట్టామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కౌన్సిలర్ బొమ్మిడి సూర్య కుమారి కృష్ణమూర్తి, నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, భూపతి నరేష్, పొన్నాల నాగబాబు, పెండ్ర శ్రీనివాసు, బొమ్మిడి వెంకట్రావు, వీరాస్వామి, కొప్పాడ సత్యనారాయణ నాట్ర నరేష్, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేష్ దారుణ హత్య

- ఆందోళనలో ప్రజా సంఘాలు



కర్నూలు జనవరి 31.(మనంబ్యూరో)ః కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారుణంగా హతమార్చారు. శనివారం ఉదయం బొందిమడుగుల గ్రామంలోని రమేష్ బొంతిరాల రోడ్డులో వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు డ్యాక్టర్తో ఢీకొని, కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్ ను కుటుంబ సభ్యులు గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా మృతి చెందినట్లు వైద్యుల ప్రకటించారు. దీంతో ఎమ్మార్పీఎస్ తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రమేష్ పై దాడి చేసి హతమార్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం కర్నూల్ లో కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఈ మార్గం లో వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది .ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండాబందోబస్తు ఏర్పాటు చేశారు .అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్ హత్యని నిరసిస్తూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పశు వైద్య శిబిరాలతో రైతులకు మేలు

- పశువైద్యాధికారి డాక్టర్. బాలకృష్ణ

తుగ్గలి, జనవరి 31(మనం న్యూస్ )ః పశు వైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు కలగనుందని పశువైద్యాధికారి డాక్టర్.బాలకృష్ణ అన్నారు. శనివారం రాంపురం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎశువులకు గాలికుంటు వ్యాధి, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు, టీకాలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండటం వల్ల పాల దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతు ఒదన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి



- ఏపీ మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే నాయకర్ వినతి

భీమవరం, జనవరి 31 (మనం న్యూస్)ః ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నరసాపురం నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కోరారు. శనివారం జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన భీమవరంలోని కలెక్టరేట్ లో నిర్వహించిన పశ్చిమ గోదావరి జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని నరసాపురం నియోజకవర్గానికి సంబంధించిన వివిధ ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, అవసరాలు, పరిపాలనా అంశాలపై ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజుతో పాటు జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజల గడపకు

- పింఛన్ల పంపిణీలో ఆదోనిలో ప్రజాసేవా స్ఫూర్తి వెల్లువ



ఆదోని, జనవరి 31 (మనం న్యూస్)ః ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే నిర్వహించడం ద్వారా ప్రభుత్వం ప్రజల పట్ల తన బాధ్యతను మరోసారి చాటింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దివ్యాంగులు వంటి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే పింఛన్ అందించే విధంగా కార్యక్రమం అమలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదోని పట్టణం 1వ వార్డు హనుమాన్ నగర్ - కిల్ చిన్ పేట్ ప్రాంతాల్లో లబ్ధిదారుల గడపకు వెళ్లి నేరుగా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన చోట తక్షణ పరిష్కారాలకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు చెన్నంపల్లి.మారుతి నాయుడు,టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ జిందే శారద , ఆదోని పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప , ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ గారు, వార్డు సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.

లబ్ధిదారులు మాట్లాడుతూ ఇంటి వద్దకే పింఛన్ అందడంతో మాకు చాలా సౌకర్యంగా ఉంది. వయస్సు, అనారోగ్యంతో బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో ఈ విధానం ఎంతో ఉపయోగపడుతోంది అని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ తరహా కార్యక్రమాలు ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నాయని నాయకులు తెలిపారు.

# ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాలి




తిరుపతి జనవరి 31 మనం న్యూస్ః సౌత్ ఈస్ట్ ఇండియా రీజియన్ ఆఫ్ వై.ఎం.సి.ఏ రీజనల్ హెల్త్ అండ్ హెల్త్ లివింగ్ అంశంపై శనివారం తిరుపతిలోని ఎ.స్బి.ఐ కాలనీ నందు సెమినార్ లో పాల్గొన్న డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆరోగ్యకరంగా జీవిస్తూ ఆరోగ్యకరమైన ప్రపంచం ను అందించాలని అంశంపై ప్రారంభ ఉపన్యాసాన్ని ఇచ్చారు .

ఈ కార్యక్రమానికి రీజనల్ సెక్రటరీ రెవరెండ్ ధనరాజు అధ్యక్షతన వహించారు. అలాగే రైట్ రెవరెండ్ జాన్సన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాస్టర్ జి.ఎస్ గంగరాజు డివోషనల్ ఓకే సందేశాన్ని అందించారు . ఫార్మర్ రీజినల్ వైస్ చైర్మన్ కృపానందం శామ్యూల్ మరియు పుత్తూరు వైఎంసిఏ కార్యదర్శి అగస్టిన్ శుభాకాంక్షలు తెలిపారు. పుత్తూరు వైఎంసి ప్రెసిడెంట్ సెల్వరాజ్ రాజు ప్రారంభ ఉపన్యాసాన్ని ఇవ్వగా, ఎలమంచిలి ప్రవీణ్ కీ నోట్ అడ్రస్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకరంగా జీవిస్తూ ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాలి అనే అంశంపై వర్తమానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాళహస్తి నుండి నగిరి నుండి పుత్తూరు, పిచ్చాటూరు తదితర ప్రాంతాల నుండి వైఎంసి ప్రతినిధులు హాజరు కావడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

## బలిజ అభ్యుదయ సేవా సమితి రజతోత్సవ వేడుకలు



- జే బీ శ్రీనివాస్, తిరుపతి రూరల్ జనసేన అధ్యక్షులు వెంకట్ రాయల్

తిరుచానూరు, జనవరి 31 మనం న్యూస్ః తిరుపతి కేంద్రంగా గత 25 ఏళ్లగా లాగా బలిజ కులస్తుల ఐక్యత మరియు అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న బలిజ అభ్యుదయ సేవా సమితి తన ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. సంస్థ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, సిల్వర్ జూబ్లీ (రజతోత్సవ) వేడుకలను పురస్కరించుకుని 'మహా బలిజ ఆత్మీయ సమావేశం' ఘనంగా నేడు తిరుచానూరు శిల్పారామం నందు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ సోదరులు కుటుంబసమేతంగా పాల్గొని కార్యక్రమం ఘనవిజయం చెయ్యమని అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్ బాబు , జనరల్ సెక్రటరీ ఊక విజయ్ కుమార్ కోరడం జరిగింది.

# దేవగుడి మూవీలో అలరించిన అనుశ్రీ



కురబలకోట, జనవరి 31, మనం న్యూస్: దేవగుడి మూవీ హీరోయిన్ అనుశ్రీ తొలి సినిమాలోనే చక్కటి హావబావాలతో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులకు ముద్దుల తనయగా, అన్నకు చెల్లిగా, స్నేహితుడికి ప్రియురాలిగా, శత్రువుల పాలిట శివంగిలా ఒకే పాత్రలో విభిన్న పార్శ్వాలు చూపించారు. ఈమె తెలుగమ్మాయి. సినిమాలో హైలెట్ నటనతో ప్రత్యేకతను చాటారు. బావోద్వేగాలతో కూడిన ఎమోషన్స్ పాటు సెంటిమెంట్స్ పండించారు. తొలి సినిమానే అయినా ఎంతో అనుభవం ఉన్న హీరోయిన్ గా నటన ప్రదర్శించారు. విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న ఈ చిత్రం గురించి శనివారం ఆమె మాట్లాడుతూ తొలి సినిమాలోనే టాలెంట్ నిరూపించుకునే పాత్ర రావడం సంతోషంగా ఉందన్నారు. అవకాశం ఇచ్చిన డైరెక్టర్ బెల్లం రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమా ఆద్యంతం ఈమె చుట్టూ తిరుగుతుంది. పవర్ ఫుల్ డైలాగ్స్ తో అందచందాలతో ఆకట్టుకుంది. తొలి సినిమాలోనే సత్తా చాటింది. అభిమానులను సంపాదించుకుంది. ప్రేక్షకుల మెప్పు పొందారు. ఓరచూపులతో కుర్రకారును ఓ రేంజ్ లో ఆకర్షించారు. ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా రానించగలరని, తొలి మూవీ బెస్ట్ మూవీ కావడం సంతోషంగా ఉందన్నారు. చిన్న సినిమాగా వచ్చి పెద్ద టాక్ తెచ్చుకుంది. మంచి సినిమాను తెలుగువారు ఎప్పుడూ ఆదరిస్తారు. తారాగణం చిన్నా పెద్దా అన్నది చూడరు. కథ బాగుంటే అక్కున చేర్చుకుంటారు. దేవగుడి సినిమాలో అదే జరిగింది. సినియా ఆద్యంతం బాగుంది. ప్రేక్షకులకు కట్టి పడేసింది. కొత్త తారాగణం కావడంతో తొలి రోజు ఆషామాషీగా భావించారు. కథ, కథనంతో పాటు మాటలు, పాటలు, సంగీతం, యాక్షన్, సన్నివేశాలు బాగుండడంతో ఈ చిత్రాన్ని ఆదరించడం మొదలు పెట్టారు. కొత్త అవకాశాలు రాగలవని బావిస్తున్నారు. తొలి సినిమాలోనే ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. ఒక్క తెలుగులోనే కాకుండా ఇతర బాషల సినిమాల్లో కూడా అవకాశాలు రాగలవని దీమా వ్యక్తం చేస్తున్నారు

# ఎమ్మెల్యే సార్.. మా ఇంటికి వస్తారా..!

- ఎమ్మెల్యే మనస్సును కదిలించిన బాలిక మాటలు
- బాలిక తల్లికి గంటలో పోర్టబుల్ ఆక్సిజన్ యంత్రం
- గొప్ప మనసు చాటుకున్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు, జనవరి 31,మనం న్యూస్ : లబ్ధిదారులకు పింఛను పంపిణీ కోసం వెళ్లిన ఎమ్మెల్యేను ఓ బాలిక మాటలు కదిలించాయి. నీకు ఏం కావాలి తల్లి అని అడిగిన ఎమ్మెల్యేతో.. ఆ బాలిక బాధతో.. నీళ్లు నిండిన కళ్ళతో.. మా ఇంటికి వస్తారా..! మా అమ్మతో మాట్లాడండి. మా అమ్మకు లంగ్స్ ప్రాబ్లం సార్ అని ఆర్తితో అడిగింది. బాలిక మాటలకు చలించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్.. పద తల్లి మీ ఇంటికి అంటూ నడుచుకుంటూ వెళ్లారు. ఆ బాలిక తన తల్లిని చూపించి. లంగ్స్ ప్రాబ్లం వల్ల నిత్యం ఆక్సిజన్ తో ఉండాలని.. తమకు అవ్వకు వచ్చే పింఛను సొమ్ములే జీవనాధారం అని తమ బాధను వెల్లడించింది. స్పందించిన ఎమ్మెల్యే బాలిక తల్లి కోటేశ్వరితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. గడిచిన ఐదేళ్లుగా ఆక్సిజన్ సిలిండర్ ఆధారంగా ఉన్నామని, ఇందుకు బాడిగ చెల్లించలేకపోతున్నామని, తమకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. బాలిక తల్లి బాధను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే సత్వరం సంధించి ఒక గంటలోనే పోర్టబుల్ ఆక్సిజన్ యంత్రాన్ని బాలిక తల్లి కోటేశ్వరికి అందించారు. చిన్న వయసులోనే కుటుంబ బాధను అర్థం చేసుకొని సమయస్ఫూర్తితో వ్యవహరించిన బాలికకు అక్కడికక్కడే సైకిల్ ను బహుమతిగా అందించారు. బాలిక విద్యాభ్యాసానికి తగిన సాయం చేస్తానని, కుటుంబానికి అండగా ఉంటానన్నారు. తమ బాధను చెప్పిన గంటలోనే తమ కష్టాన్ని తీర్చి.. ఆక్సిజన్ యంత్రాన్ని అందించిన ఎమ్మెల్యే గారికి ఆ కుటుంబం ధన్యవాదాలు తెలిపింది. ఇంతకీ ఆ బాలిక పేరు ఏంటనే కదా..! మీరు ఆలోచిస్తున్నారు.. పేరు



లక్షిక, వన్నియర్ బ్లాక్ మున్సిపల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. శభాష్ లక్షిక..! హాట్సాఫ్ ఎమ్మెల్యే గారు..!

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం

## గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు



**పాలకొల్లు, జనవరి 31(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ప్రధాన ద్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అటువంటి మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలం చించినాడ, కాజ పడమర గ్రామాల్లో రూ కోటి యాభై లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో ప్రజలు మంత్రి రామానాయుడు కు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో మెలగాలని దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నిటిని నెరవేర్చమన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం కింద 15000 చొప్పున, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20,000 సాయం వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి,సొసైటీ అధ్యక్షులు బొప్పన హరి కిశోర్, రుద్ర రాజు సత్యనారాయణ రాజు,పి,నరసింహ రావు మామిడి శెట్టి పెద్ది రాజు, కడలి గోపి,నాయకులు పాల్గొన్నారు.

# ఓసిల హక్కుల సాధనకై చలో ఢిల్లీ

● సన్నాహక సభ పోస్టర్ ఆవిష్కరణ

**రంగారెడ్డి, జనవరి 31 (మనం న్యూస్):** ఓసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ఫిబ్రవరి 23వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసీల హక్కుల సాధనకై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఓసీ జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాదులోని రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ కుల సంఘాల నాయకులతో ఓసి జెఏసి ఆధ్వర్యంలో సన్నాహక సభ , పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుప్త మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఫిబ్రవరి 23న జరిగే జంతర్ మంతర్ నిరసన సభకు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఓసి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినటువంటి ఓసి జేఏసీ పక్షాన 12 డిమాండ్ల పరిష్కారానికి నిరసన కార్యక్రమాన్ని అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓసి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త మాట్లాడుతూ

ఈ డబ్ల్యూ ఎస్ జాతీయ స్థాయి కమిషన్ ను ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 సంవత్సరాల కాలపరిమితి కలిగి ఉండాలి. ఆదాయపరిమితి 10 లక్షలు పెంచాలి. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితి పెంచాలి.

ఈడబ్ల్యూఎస్ బ్యాక్ లాగ్ పోస్టులను ఈడబ్ల్యూఎస్ వారితోనే భర్తీ చేయాలి. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఫీజు రాయితీ కల్పించాలి. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అమలు చేయాలి. అన్ని సామాజిక వర్గాలకు క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలి. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు అన్ని రాష్ట్రాలలో సంపూర్ణంగా అమలు చేయాలి. ప్రస్తుతం 50 శాతం పెంచకుండా ఓసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతు పండించిన పంటలకు రైతే ధర నిర్ణయించేందుకు చట్టం తేవాలి. రైతులకు రైతు బీమా వయోపరిమితే 70 సంవత్సరాలు వరకు పెంచాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఓసి జేఏసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు దాచేపల్లి సీతారాం, అల్లాడి వీరభద్రయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ పొద్దుటూరి వేణు, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు రాములోని రామనాథం, పసునూరి శ్రీనివాస్, కోటగిరి మహేష్, ఏవి రావు, గుడు గుండ్ల మహేష్ గుప్తా పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

# రొయ్యల మేత ధరలు పెంచితే ఆందోళన చేపడతాం

## రైతు సంఘాల అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు హెచ్చరిక



**పాలకొల్లు, జనవరి 31,మనం ప్రతినిధి :** రొయ్యల మేతదరలు పెంచితే రాష్ట్రవ్యాప్తంగా రైతులందరితో కలిపి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో ఆక్వా రైతుల సంఘాల సభ్యులు, నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆక్వా రంగం సంక్షోభంలో ఉన్న తరుణంలో మేతదరలు పెంచితే రైతుల పరిస్థితి మరింత ఆర్థిక ఇబ్బందులోలోకి వెళిపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మేత ధరలు పెంచకుండా ఏపీ రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఆక్వా రైతు సలహా కమిటీ అప్సర ప్రతినిధులు కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

మేడిది జన్ రాజు మాట్లాడుతూ రొయ్యలు మేత కు 50 శాతం రైతుకు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎం జాన్ డేవిడ్ రాజు, బోనం చినబాబు,ఏం ఫణి ప్రసాద్, అంగర వరప్రసాద్,పి సత్యనారాయణ రాజు, చిలుకూరి బాలాజీ, దేవల ప్రసాద్, తదితరులు పాల్గొని మాట్లాడారు.



# ఒక రోజు ముందు గానే ఎన్టీఆర్ భరోసా ఫెన్షన్ పంపిణీ

● లబ్ది దారులకు ఫించన్లు పంపిణీ చేసిన మండల అధ్యక్షులు ములిశెట్టి నాగు

**కుక్కునూరు, జనవరి 31 ( మనం న్యూస్ ):** ఎన్టీఆర్ భరోసా ఫెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజు ముందుగానే రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ పంపిణి చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు భాగ్యసామి కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ పింఛన్ కార్యక్రమం లో పాల్గొని లబ్ధిదారులకు ఫించన్లు పంపిణీ చేసిన మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ములిశెట్టి నాగు.ఈ సందర్భంగా నాగు మాట్లాడుతూ

వృద్ధులు,వికలాంగులుకు చంద్రబాబు గారి ఆదేశాలు మేరకు ఒక్కరోజు ముందుగానే పెన్షన్ అందజేస్తున్నామని, బడుగు బలహీన వర్గాల కోసం కూటమీ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక కుక్కునూరు మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, కుక్కునూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు హరిబాబు,సూర్ల సూర్యం,పాదం రాము తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురం మార్కెట్లో బంగారు ఆభరణాల దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

## మహిళ నిందితురాలి అరెస్టు

## 6.14 తులాల బంగారు ఆభరణాలు రికవరీ

**శ్రీకాకుళం, జనవరి 31 (మనం న్యూస్):** శ్రీకాకుళం జిల్లా , ఇచ్చాపురం పట్టణ పరిధిలోని ఏ.ఎస్. పేటకు చెందిన పిర్యాదిదారు, మండపల్లి గ్రామం, ఇచ్చాపురం మండలంలో ఉన్న తన కూతురు ఇంటి వద్ద నుంచి తనది మరియు తన కూతురికి చెందిన సుమారు 6.14 తులాల బంగారు ఆభరణాలను ఒక బాక్స్లో పెట్టి, హ్యాండ్బ్యాగ్లో వేసుకొని ఇచ్చాపురం మార్కెట్కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేశారు. అనంతరం బ్యాగ్ను పరిశీలించగా జిప్ తెరచి ఉండి, అందులో ఉన్న బంగారు ఆభరణాల బాక్స్ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, ఈ రోజు అనగా తేదీ 31.01.2026 న ఇచ్చాపురం టౌన్ ఎస్.ఐ. గారికి అందిన సమాచారం మేరకు, పోలీసు సిబ్బందితో కలిసి ఇచ్చాపురం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించగా, ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. మహిళా పోలీసు సిబ్బంది సహాయంతో విచారించగా, ఆమె తేదీ 25.01.2026 న ఇచ్చాపురం మార్కెట్లో బంగారు ఆభరణాలు దొంగిలించి, రైల్వే స్టేషన్కు వచ్చి రైలు కోసం వేచి ఉన్నట్లు అంగీకరించింది అని ఆమె వద్ద నుండి దొంగిలించబడిన 6.14 తులాల బంగారు ఆభరణాలను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకొని, ఉదయం 11:30 గంటలకు నిందితురాలిని అరెస్టు చేయడమైనది అని శనివారం ఇచ్చాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నం నాయుడు ఒక ప్రకటన రూపంలో కేసు వివరాలు తెలిపారు.

**ప్రజలకు జిల్లా ఎస్పీ గారి ముఖ్య సూచనలు:**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, రద్దీ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వేగవంతమైన దర్యాప్తుతో నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి అని తెలిపారు.

# కివ్వాక గ్రామం లో నూతన వితంతు పెన్షన్లు అందజేసిన కూటమి నాయకులు



**కుక్కునూరు, జనవరి 31 ( మనం న్యూస్):** మండలంలొ గల కివ్వాక గ్రామపంచాయతీలో ఎన్ టి ఆర్ భరోసా నూతన వితంతు, వృద్ధప్య, వికలాంగ పెన్షన్లను మండల కూటమి పంపిణి చేశారు. ముఖ్య మంత్రి, ఉప ముఖ్య మంత్రి ఆదేశాలు మేరకు పౌజ్ పెన్షన్లు కివ్వాక గ్రామంలో ఇటీవలే మరణించిన కారుమంచి వెంకటేశ్వరావు సతీమణి ఈశ్వరమ్మ కు శనివారం నాడు నూతన పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కివ్వాక గ్రామ సర్పంచ్ మడివి రాజులు, మండల అభివృద్ధి అధికారి సి ఎచ్ నాగరాజు ,జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ ,మోదంపరుపు వెంకన్న బాబు ,టిడిపి సీనియర్ నాయకులు ముప్పాల సాంబశివరావు , చిలకల మల్లయ్య , టిడిపి గ్రామ సెక్రెటరీ పెండ్యాల నరసింహమూర్తి, గ్రామ టిడిపి నాయకులు చిలకల లక్ష్మణరావు, చిలకాల వెంకన్న , కనేని దుర్గారావు ,చిలకాల కృష్ణ, దండ బత్తుల నాగరాజు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం

**జంగారెడ్డిగూడెం జనవరి 31 మనం ప్రతినిధి:** జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన దొడ్డిగర్ల సూర్య చంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాదకర ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్రంగా కలత చెందారు.

విషయం తెలుసుకున్న శ్రీ గౌతమి జూనియర్ కాలేజ్, గోపాలపురం నందు 2001-2003 విద్యా సంవత్సరాల్లో మృతుడితో కలిసి చదువుకున్న 35 మంది తోటి విద్యార్థులు స్పందించి, తమ స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు. కాలేజ్ డైరెక్టర్ ఆశీర్వాదంతో కలిసి వారు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు.

మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఆద్య, లాస్య శ్రీ ఉండగా, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ.50,000లను ఇద్దరి పేర్లపై పోస్టాఫీసులో డిపాజిట్ చేసినట్లు మృతుని స్నేహితురాలు భాను ప్రియాంక తెలిపారు. స్నేహబంధానికి నిదర్శనంగా తోటి విద్యార్థులు చేసిన ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలను పొందుతోంది.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గౌరు

**గడివేముల, జనవరి 31మనం న్యూస్:** గడివేముల మండల కేంద్రంలో శనివారం నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్వయంగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో పెన్షన్ దారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టారని ఆమె అన్నారు. వృద్ధులు వికలాంగులు, వితంతువులు అనారోగ్యం బారిన పడిన అభాగ్యులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సహాయం వల్ల నెలవారి ఆరోగ్య వైద్య ఖర్చులతో పాటు కొన్ని పేద కుటుంబాలు సైతం వృద్ధులపై విసుగు చెందకుండా ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టిడిపి సీనియర్ నాయకులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, దేశం నరేంద్ర రెడ్డి, దేశం రమణారెడ్డి, వంగాల మురళీమోహన్ రెడ్డి, ఎస్ ఏ రఫిక్, టిడిపి సీనియర్ నాయకులు బిడుదురి సీతారామిరెడ్డి, జనసేన నాయకులు ధరణి చంద్రమోహన్, సుర నాగేశ్వర్ రెడ్డి, మహమ్మద్ రఫి, సిరిపిరెడ్డి పుల్లారెడ్డి, టిడిపి కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైలు కిందపడి ముగ్గురు ఆత్మహత్య

## మృతులు తల్లి,కూతురు,కుమారుడిగా గుర్తింపు



**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేకప్రతినిధి):** హైదరాబాద్ నగర శివారులోని చర్లపల్లిలో రైలు కిందపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. చర్లపల్లి- ఘట్కేసర్ రైల్వే స్టేషన్ మధ్య శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో రైల్వే ట్రాక్పై మృతదేహాలను గుర్తించిన గూడ్స్ రైలు లోకోపైలట్ సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కాగా, మృతులను బోడుప్పల్ ప్రాంతానికి చెందిన పిన్నింటి విజయశాంతి(38), కూతురు చేతన రెడ్డి, కుమారుడు విశాల్ రెడ్డిగా గుర్తించారు. చేతన ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, విశాల్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగుచూసింది. విజయశాంతి ఇద్దరు పిల్లలతో కలిసి బోడుప్పల్ ఉంటుండగా.. ఆమె భర్త సురేందర్ రెడ్డి నెల్లూరులో ఉంటున్నాడని పోలీసులు తెలిపారు.

విజయశాంతి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తుండగా ఆమె భర్త సురేందర్ రెడ్డి నెల్లూరులోని సిరామిక్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం

**నందవరం జనవరి మనం న్యూస్:** నందవరం మండల పరిధిలోని మిట్టసోమాపురం గ్రామంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మిట్టసోమాపురం గ్రామంలో నందవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నందవరం మండల అధ్యక్షులు కాసీంవలి మాట్లాడుతూ గ్రామ టిడిపి నాయకులు వీరేష్ లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఒకరోజు ముందుగానే పెన్షన్స్ లు పంపిణీ చేస్తున్న మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు ఆంధ్రప్రదేశ్లో జూలై 2024 నుండి అమలులోకి వచ్చిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద, సామాజిక భద్రతా పెన్షన్లు నెలకు రూ. 4,000 నుండి రూ. 15,000 వరకు వర్తిస్తాయి. వృద్ధులు, వితంతువులు, గీత/నేత కార్మికులకు రూ. 4,000, వికలాంగులకు రూ. 6,000, మరియు తీవ్రమైన వైకల్యం లేదా దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి రూ. 10,000 - రూ. 15,000 వరకు పెన్షన్ అందుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గారు నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో మిట్టసోమాపురం నాయకులు మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్సీ వంక రవీంద్ర



**పాలకొల్లు, జనవరి 31(మనం ప్రతినిధి):** బాల్య వివాహాలు పట్ల ప్రజాప్రతినిధులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ వంక రవీంద్ర అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిట్టూరి రు కనక లక్ష్మి అధ్యక్షతన జరిగిన శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. మరో ముఖ్య అతిథి, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రాకపోయినా సరే అధికారులు సమైక్యంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. చింతపర్రు సర్పంచ్ గుమ్మపు పెద్దిరాజు మాట్లాడుతూ పంచాయతీ కొబ్బరి చెట్లు దింపు సమయంలో విద్యుత్తు నిలపాలని కోరగా ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ శుక్ర శనివారాల్లో ఒక గంట మాత్రమే సాధ్యమవుతుందని సమాధానం ఇచ్చారు. సమావేశంలో పలువురు పలు సమస్యలపై మాట్లాడగా ఎంపీడీవో ఉమా మహేశ్వర్ రావు,ఈవోపీఆర్డి మూర్తి బాబు సమాధానం తెలిపారు. ఈ సమావేశంలో నీటి సంఘం అధ్యక్షులు పుల ఖండం వీరరాఘవులు, సెగ సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన టిడిపి నాయకులు సచివాలయ సిబ్బంది

## సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



**ఆచంట జనవరి 31 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి ఒకటవ తేదీన పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే జనవరి 31 శనివారం ఆచంట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వృద్ధులకు వికలాంగులకు ఒంటరి మహిళలకు సచివాలయ సిబ్బంది టిడిపి జనసేన బిజెపి కూటమి నాయకులు అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ నగదు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు దీంతో పెన్షన్ దారులు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల అర్హులైన పింఛన్దారులు ఎవరైనా నగదు తీసుకోకపోతే ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం సెలవు రోజు అయినందున రెండవ తేదీన పెన్షన్ తీసుకోవాలని అన్నారు పెన్షన్ నగదు అందుకున్న లబ్ధిదారులు అత్యవసరాలకు వినియోగించుకోవాలని తెలిపారు దూర ప్రాంతాలకు వెళ్లిన పెన్షన్దారులు ఎవరైనా మిగిలి ఉంటే తదుపరి రెండు నెలల్లో పెన్షన్ నగదు సంబంధిత కార్యాలయాల్లో తీసుకోవచ్చని తెలిపారు

# తిరుమల శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

**తిరుమల, జనవరి 31, మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి,దర్శకుడు ఎస్.గోపాలరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి దర్శకుడు అనిల్ రావిపూడి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా,ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం వెలుపల అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ తో మన శంకర్ వరప్రసాద్ గారు సినిమా చేసి మంచి విజయవంతమైనందుకు అభిమానులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అలాగే ప్రతి సినిమాకు స్వామివారిని దర్శించుకోవడం అలవాటు ఈ నేపథ్యంలో ఈరోజు మా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నాను అని అనిల్ రావిపూడి తెలిపారు .



# అవిశ్వాస తీర్మానం నెగ్గిన మాంద్ర

**జూపాడుబంగ్లా, జనవరి 31 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించిన అవిశ్వాస తీర్మాన ఎన్నికలలో మండల అధ్యక్షురాలు సువర్ణమ్మ, పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలపడంతో సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయారు. ఈ సందర్భంగా ఏడు మంది ఎంపీటీసీ లను ఎన్నికల అనంతరం నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, వారిని పూలమాలలతో అభినందించడం జరిగినది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సక్రమంగా పనులు జరగనివ్వక సరైనటువంటి సహకారం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రహించి ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావడం జరిగిందని. ఎంపిటిసిలు అందరూ కూడా మండల అభివృద్ధిని ఆకాంక్షించి మన గ్రామాలు బాగుండాలని.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇస్తున్నటువంటి నిధులు కానివ్వండి. వస్తున్నటువంటి అభివృద్ధి పనులు కానివ్వండి ప్రజలు క్షేమంగా సంతోషకరంగా ఉండే విధంగా మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, చూస్తున్నారు అని. అన్నీ కూడా మంచిగా జరిగేందుకే ఈరోజు మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ లను మన టిడిపి కైవసం చేసుకోవడం జరిగిందని. మాంద్ర శివానందరెడ్డి సారథ్యంలో అన్ని మండలాలు బాగుండాలి అన్ని గ్రామాలు బాగుండాలి అనే అంశంతో వచ్చినటు వంటి ఫండ్స్ ఏదైతే ఉందో గ్రామాలు అభివృద్ధి చెందే దిశగా ఈరోజు అందరు కూడా కృషి చేయాలనే దిశగా మా వైపు రావడం జరిగిందని. కచ్చితంగా ఈ అవిశ్వాస తీర్మానాన్ని అభివృద్ధిని పొందుపరిచేందుకే ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని. ఈరోజు ఈ మండలంలో జరిగేటువంటి ఎన్ ఆర్ జి ఎస్ పనులు కాని మండలానికి ఏ పనులు వచ్చినా సరే అడ్డుపడినారని చెప్పేసి ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి నెగ్గడం జరిగిందని. దీనికి సహకరించిన ప్రతి ఒక్క ఎంపీటీసీ లకు మండల టిడిపి నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, నందికొట్కూరు మండల కన్వీనర్ మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, గిరీశ్వర్ రెడ్డి,80 బన్నూరు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, కె సి కెనాల్ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రవి కుమార్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## కూటమి అపచారానికి పరిహారంగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు



**మంత్రాలయం , జనవరి 31,మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం అపచారానికి పరిహారంగా మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన తిరుపతి లడ్డు వ్యవహారంలో కూటమి ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేసి కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ఆడుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆ భగవంతుడే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు భీంరెడ్డి , మండల ఇన్చార్జ్ విశ్వనాథ్ రెడ్డి , పెద్దకడబూర్ మండల నాయకులు పురుషోత్తం రెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై అవగాహన కార్యక్రమం



- **భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి**
- **ఎస్సై యు వేణుగోపాల్ రాజు**

**సి.బెళగల్ జనవరి 31 మనం న్యూస్:** సి.బెళగల్ మండలం బురాండొడ్డి గ్రామంలో శనివారం నాడుసి. బెలగల్ పోలీస్ స్టేషన్కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ వేను గోపాల్ రాజు ఆధ్వర్యంలో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన, భూ వివాదాల విషయంలో చట్టపరమైన పరిష్కార మార్గాలు అనే అంశాలపై గ్రామ ప్రజలకు వివరంగా అవగాహన కల్పించబడింది. ఈ సందర్భంగా వేను గోపాల్ రాజు మాట్లాడుతూ, మహిళలపై నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాధితులకు పోలీస్ శాఖ నుంచి పూర్తిస్థాయి సహాయం అందించబడుతుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్, సీట్బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భూ వివాదాల విషయంలో గ్రామస్థులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా రెవెన్యూ శాఖ మరియు పోలీస్ శాఖను సంప్రదించి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్యవైశ్యుల్లో 95 శాతం కూటమికి ఓటు వేశారు

- **రాష్ట్ర మంత్రి టీజీ భరత్**

**కర్నూలు జనవరి 31మనం న్యూస్:** గడిచిన ఎన్నికల్లో 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమికి ఓటు వేశారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి, అనంతపురం జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ మండపం ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డితో కలిసి ఆయన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ మండపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జే.సి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కూటమికి అండగా నిలిచారన్నారు. అందుకు తగ్గట్టుగానే సీఎం నారా చంద్రబాబు నాయుడు వైశ్యులకు ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. పక్క రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వైశ్యులకు మంత్రి పదవి ఇచ్చారన్నారు. అంతేకాకుండా పెనుగొండను వాసవి పెనుగొండగా పేరు మార్పుచేశారన్నారు. ఇక




అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం అమరావతిలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం 6 ఎకరాల స్థలం కేటాయించిందని, అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం పెడుతున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. 9 నెలల్లో దేశంలోవచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని ఇటీవల ఓ నివేదిక వెల్లడించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇక స్థానికంగా జే.సి కుటుంబం వైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వారి సహకారం వల్లే ఇలాంటి గొప్ప కార్యక్రమం జరుపుకుంటున్నామన్నారు. మంచిచేసే నాయకులకు ఎప్పటికీ అండగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమా నాగ రాగిణి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, వాసవి సత్ర సముదాయాల ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.వి.ఆర్ జగదీష్ గుప్త, ఆర్యవైశ్య సంఘం తాడిప్రతి ఛైర్మన్ సురేంద్రనాథ్, కాశీ అన్నపూర్ణ సత్రాల ప్రెసిడెంట్ భవనాశి వాసు, పొలిటికల్ ఛైర్మన్ సత్యనారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్, అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 36 రోజులకు 37 లక్షల ఆదాయం



**మహానంది, జనవరి31,మనంన్యూస్:** శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 36 రోజులకు 37 లక్షల 47వేళా126 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తుండటంతో ఉభయ ఆలయాలలోని హుండీలను శనివారం భక్తులు,సేవకుల ద్వారా లెక్కింపు చేశారు. యుఎస్ ఏ1రూపాయ డాలర్ 1,5రూపాయల డాలర్ లు 2,భూటాన్ 20, వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో డిఈఓ మోహన్,ఏఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి,నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, సేవాసమితి సభ్యులు, భక్తులు,పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పథకాలతో ప్రజలకు లబ్ది

- **ఒక రోజు ముందుగా పెన్షన్‌ల పంపిణి**
- **పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్**



**కర్నూలు , జనవరి 31(మనం న్యూస్ బ్యూరో):** కూటమి ప్రభుత్వం కు ప్రజలు ముఖ్యమని ప్రభుత్వ పథకాలను అమలు చేసి ప్రజలకు లబ్ది చేస్తుందని, వాణిజ్యం , పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం మంత్రి 52వ వార్డు కొండారెడ్డి బురుజు దగ్గర నుండి సాయిబాబా గుడి వరకు ఉన్న 15 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు విచారించి మాల శ్రీనివాసులు , చిన్న ఖాసీం లకు వికలాంగుల పెన్షన్ ను.. మీనాక్షి , నాగమని లకు వితంతు మరియు ఇతరులకు వృద్ధాప్య - ఒంటరి మహిళల పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా పని చేస్తున్నది అన్న విషయాలు మంత్రి వారిని ప్రశ్నించగా వారు మేము ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామన్న విషయం తెలియజేశారు. ప్రతినెలా టంచునుగా పెన్షన్ వస్తుందా అని మరియు మొత్తం పెన్షన్ ఇస్తున్నారు కదా అని కూడా అడిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఈ కుటమి ప్రభుత్వం ఒకటో తారీకు సెలవు దినమైనప్పుడు పెన్షన్ ను ఒక రోజు ముందుగానే అందజేస్తుందని , అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెయ్యి రూపాయల మొత్తాన్ని ఒకటేసారి పెంచి 4000 ఇస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ 6,000 లు , మంచానికే పరిమితమైన వారికి 15 వేల వరకు పెన్షన్ అందజేస్తున్నామని భారతదేశంలో అత్యధిక సంఖ్యలో పెన్షన్ ఇస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం మాత్రమే అని , ప్రజలకు పథకాలు అన్నిటిని అమలు చేసి మంచి ప్రభుత్వం అన్న ప్రశంశ తెచ్చుకునిందని తెలిపారు.దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి టి.జి. భరత్ ప్రజలకు తెలియజేశారు. దావోస్ వరల్ ఎకనామిక్ ఫోరం లో జరిగిన వివరాలు తెలుపుతూ భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల కంటే ఉత్తమంగా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు ఆహ్వానించే కమిట్మెంట్ ను అక్కడ వ్యాపారస్తులకు తెలపడం జరిగిందని మంత్రి తెలియజేశారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి కర్నూలు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా



- **లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్నా టీడీపీ గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్**

**పత్తికొండ జనవరి 31(మనం న్యూస్ ):** పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం నిజమైన ప్రజాసంక్షేమానికి నిదర్శనమని నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్ అన్నారు.శనివారం ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్,టీడీపీ తెలుగు రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్ నాథ్ ఆదేశాలు మేరకు నలకదొడ్డి గ్రామంలో సచివాలయం సిబ్బందితో కలిసి అయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బత్తిన రాజశేఖర్ మాట్లాడుతూ అవ్వాతాతల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషమే మా కూటమి ప్రభుత్వానికి అసలైన విజయమని అయన పేర్కొన్నారు.అడుగడుగునా ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అందించిన ఆశీస్సులు మరువలేనివి అని అయన అన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒకరోజు ముందే అందించడంతో ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం కనిపిస్తోంది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ భార్గవి,రోజా,రాణి, టిడిపి నాయకులు రఘు శేఖర్, దశరథ్, మల్లికార్జున, రామలింగప్ప, నరసప్ప, రామన్న పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతపై మంత్రాలయం టీడీపీ ఇంచార్జి దృష్టి



**కౌతాళం, జనవరి 31 మనం న్యూస్:** సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కౌతాళం మండలం తోవి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి,జనసేన ఇంచార్జి లక్ష్మన్న,బిజెపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు గడపగడపకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, వృద్ధులు,వికలాంగులు, వితంతువులు ఎవరికి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా వారి ఇంటి వద్దకే చేరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అదేవిధంగా,10లక్షల ఇచి రోడ్డు డ్రైనేజీ పనులకు భూమి పూజను పూర్తి చేశారు.అలాగే, 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు ఏరిగేరి వెళ్లే రహదారి సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో నేరుగా పాల్గొంటూ, సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణ సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ నాయుడు సతీష్ నాయుడు,టీబీ ఎల్ ఎల్ సి చైర్మన్ టిప్పు సుల్తాన్,సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్,మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, టౌన్ అధ్యక్షులు రాజానందన్,గ్రామ అధ్యక్షులు శంకర్, సొసైటీ డైరెక్టర్ సోమనాథ్, గ్రామయువ నాయకుడు విజయ్ మరియు కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన అవిశ్వాస తీర్మానం



**జూపాడుబంగ్లా, జనవరి 31 (మనం న్యూస్):** నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలో మండల అధ్యక్షురాలి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఎన్నికల అధికారి ఆర్డిఓ నాగజ్యోతి, ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తీర్మానం ఎన్నికలు నిర్వహించడం జరిగినది, ఈ అవిశ్వాస తీర్మానం ఎన్నికలకు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు వైయస్సార్సీపి నుండి నీయమ్మతులైన మండల ఎంపీపీ సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయేందుకు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తడంతో సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి ఆర్డిఓ నాగజ్యోతి, మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలు ఉండగా అందులో ఒకరు మరణించగా ఇంకొకరు రాజీనామా చేయడం జరిగిందని, మిగతావారు ఈ అవిశ్వాస తీర్మానానికి ఎంపీడీవో కార్యాలయం నందు హాజరు కావడం జరిగిందని. అవిశ్వాస తీర్మానానికి ఏడు మంది హాజరై 7 మంది చేతులు ఎంపీపీ సువర్ణమ్మ, పై అవిశ్వాసం తెలియపరచడం జరిగిందని. మండల అధ్యక్షురాలి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని. ఈ ఓటింగ్ ప్రక్రియను కమిషనర్ వారికి పంపియడం జరుగుతుందని. తర్వాత మండల అధ్యక్షురాలిగా ఎంపికపై పంచాయతీరాజ్ కమిషనర్ వారు తెలియపరచడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.ఈ అవిశ్వాస తీర్మానానికి సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై మల్లికార్జున, వారి పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా శాంతియుతంగా అవిశ్వాస తీర్మాన ఎన్నికలు నిర్వహించడం జరిగింది, ఈ అవిశ్వాస తీర్మానంలో టిడిపి ఘన విజయం సాధించిందని స్థానికులు తెలియజేశారు.

## అట్టహాసంగా పింఛన్లు పంపిణీ




**సి.బెళగల్ జనవరి 31 మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ మంగళవారం నాడు సి.బిలగల్ మండలం బూరం దొడ్డి గ్రామంలో మండల కన్వీనర్ బి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈరోజు ఇంటింటికి వెళ్లి అవ్వదాతలకు వితంతువులకు పింఛను పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వితంతువులకు4000 దివ్యాంగులకు రూపాయలు6000 కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తల సేమియా కాలేయము వ్యాధిగ్రస్తులకు 10 వేల రూపాయల పెన్షన్ మరియు మంచానికి పరిమితమైన వారికి 15 వేల రూపాయల పింఛను ప్రతి నెల ప్రభుత్వము ప్రతి ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు లోకేష్ గారు ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి ఇవ్వాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో పోలకల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బి చిన్న తిమ్మప్ప బి చంద్రశేఖర్ అమర్ సి.బెళగల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పి భీమన్న ధనుంజయ చికెన్ ఈరన్న ఈరన్న గౌడ్ మరియు మారం దొడ్డి గ్రామానికి చెందిన జిక్రియ భాష రుక్మాన్ పెద్ద సోమప్ప అలాగే పలుకు దొడ్డి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు బి రాజు గిడ్డయ్య బూరందొడ్డి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి సర్పంచ్ రామకృష్ణ ఎస్ నాగరాజు సి.బెళగల్ మండలంలోని పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కర్నూలు బిడ్డకు అరుదైన గౌరవం

- **ముద్దనూరు సీఐ సందెపోగు నాగేష్ బాబుకు 'పోలీసు సేవా పతకం'**



**కర్నూలు, జనవరి 31మనంన్యూస్:** కర్నూలు జిల్లా గర్వించదగ్గ పోలీస్ అధికారి, ప్రస్తుతం కడప జిల్లా ముద్దనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న సందెపోగు నాగేష్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. పోలీస్ శాఖలో ఆయన అందిస్తున్న అసమాన సేవలకు గుర్తింపుగా 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పోలీసు సేవా పతకాన్ని' ప్రకటించింది.

**23 ఏళ్ల నిరంతర కృషికి లభించిన ఫలితం**

గత 23 ఏళ్లుగా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించిన నాగేష్ బాబు, నిబద్ధత గల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా, వృత్తి పట్ల ఆయన చూపిస్తున్న అంకితభావాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. క్లిష్ట సమయాల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి కేసులను ఛేదించడంలో ఆయన చూపిన చొరవను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు కొనియాడారు.

**కర్తవ్య నిర్వహణలో కఠినం.. బాధితుల పట్ల కరుణ**

నాగేష్ బాబుకు ఈ పతకం దక్కడంపై ఆయన మిత్రులు, సన్నిహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతో నిక్కచ్చిగా, క్రమశిక్షణతో వ్యవహరించే ఆయనకు, సమాజ సేవ పట్ల ప్రత్యేక మక్కువ ఉందని వారు గుర్తు చేశారు. బాధితుల పట్ల కరుణతో మెలుగుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గొప్ప సేవా గుణం ఆయన సొంతమని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన అధికారిగా రాష్ట్ర స్థాయిలో ఇటువంటి గుర్తింపు పొందడం జిల్లాకే గర్వకారణమని ఆత్మీయులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.






## ఫుల్ స్వింగ్‌లో రవితేజ 'ఇరుముడి' షూట్!?

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం భర్త మహాశయులకు సంక్రాంతి కానుకగా వచ్చి అలరించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఈ సినిమా తర్వాత తన నుంచి అనౌన్స్ అయ్యిన సినిమానే ఇరుముడి. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ తోనే మంచి పాజిటివ్ వైబ్స్ ని సొంతం చేసుకుంది.

ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్ లో నడుస్తున్నట్టు తెలుస్తోంది. డైలాగ్ కింగ్ సాయి కుమార్ తదితర ముఖ్య తారాగణంతో ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది అని తెలుస్తోంది. రవితేజ సినిమాలు ఎంత ఫాస్ట్ గా కంప్లీట్ అవుతాయో తెలిసిందే. అలానే ఇది కూడా కంప్లీట్ అవుతుంది. ఇక ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

## ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల విజేతగా రిబకినా



ఆస్ట్రేలియా ఓపెన్-2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్తాన్ స్టార్ ఎలెనా రిబకినా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ప్రపంచ నంబర్ 1 ఆర్యానా సబలెంకాపై 6-4, 4-6, 6-4 తేడాతో విజయం సాధించిన రిబకినా.. తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ను కైవసం చేసుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్ ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగింది. తొలి సెట్ లో నిలకడైన ఆటతో 6-4 తేడాతో రిబకినా గెలచుకుంది. అనంతరం సబలెంకా తన మార్కు పవర్ హిట్టింగ్ తో పుంజుకుంది. ఈ సెట్ లో రిబకినాను 6-4 తేడాతో ఓడించిన సబలెంక.. మ్యాచ్ ను నిర్ణయాత్మక మూడో సెట్ కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్ లో కూడా సబలెంకా సత్తా చాటింది. వరుస గేమ్ లు గెలుస్తూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లి టైటిల్ దిశగా సాగింది. అయితే ఆదే సమయంలో ఎలెనా రిబకినా అద్భుతమైన పోరాట పటిమ కనబరిచింది. సబలెంకా సర్వీస్ ను వరుసగా రెండుసార్లు బ్రేక్ చేసిన రిబకినా, 6-4 తేడాతో సెట్ ను సొంతం చేసుకుంది. తద్వారా తొలి ఆసీస్ ఓపెన్ టైటిల్ ఆమె ఖాతాలో చేరింది.

## తండ్రికి తగ్గ తనయుడు..

### యాభై వికెట్ల క్లబ్‌లో ఆ యువ క్రికెటర్..

భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తనయుడు, ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ అర్జున్ తెందుల్కర్ కొత్త రికార్డు అందుకున్నాడు. అతడు ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో 50 వికెట్ల క్లబ్ లో చేరాడు. రంజీట్రోఫీలో భాగంగా గోవా




తరపున అతడు మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్ లో ఈ ఘనతను సొంతం చేసుకున్నాడు. 2022- 2023 సీజన్ లో అర్జున్ తెందుల్కర్ గోవా తరపున తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడాడు. అతడు ఆ మ్యాచ్ లోనే రాజస్థాన్ పై సెంచరీ బాదాడు. అలాగే ఆ తర్వాత గోవా తరపున బౌలింగ్ లో అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

అతడి ఖాతాలోని 50 వికెట్లలో 13 వికెట్లను ఈ రంజీ ట్రోఫీ సీజన్ లోనే సాధించడం విశేషం. అర్జున్.. ఫస్ట్ క్లాస్ కెరీర్ లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నప్పటికీ.. తన తండ్రి సచిన్ కన్నా 21 వికెట్ల వెనకంజలో ఉన్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో సచిన్ 71 వికెట్లు సాధించాడు. దేశవాళీల్లో మొదట ముంబయి తరపున ఆడిన అర్జున్ తెందూల్కర్ తర్వాత గోవాకు మారాడు. అప్పటి నుంచి అతడు ఆల్ రౌండర్ గా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ఐపీఎల్ లో ఇంతకు ముందు ముంబయి ఇండియన్స్కు ప్రాతినిధ్యం వహించిన అతడు.. 2026 సీజన్ లో లఖ్ నవూ సూపర్ జెయింట్స్కు ట్రేడ్ ద్వారా వెళ్లిన విషయం తెలిసిందే.

సచిన్ తెందుల్కర్ బ్యాట్ తోనే కాకుండా, బంతితోనూ క్రికెట్లో తన ముద్ర వేశాడు. అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ ఫార్మాట్లో 46, వన్డేల్లో 154 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఒక్క టీ20 మ్యాచ్ ఆడిన సచిన్.. పొట్టి ఫార్మాట్ లోనూ ఒక వికెట్ ను తీసుకున్నాడు.

## సచిన్‌తో ముచ్చటించిన ఇండియా అండర్-19 క్రికెట్ జట్టు



భారత అండర్-19 క్రికెట్ జట్టు.. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తో వర్చువల్ గా సమావేశమైంది. ఆదివారం భారత్, పాకిస్థాన్ తో సూపర్ సిక్స్ లో భాగంగా తలపడనుంది. సచిన్ తో జట్టు సమావేశమైన ఫొటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది. 'తర్వాతి తరానికి ఇదో అమూల్యమైన అనుభవం. విజయం పొందేందుకు, క్రీడలో దీర్ఘకాలం కొనసాగేందుకు అవసరమైన ముఖ్యమైన అంశాలపై అవగాహన పొందారు' అని బీసీసీఐ ఆ పోస్టులో పేర్కొంది.

'సాంకేతిక నైపుణ్యాలు, ఫిట్ గా ఉండటానికి మాత్రమే పరిమితం కాకుండా.. దృష్టి కేంద్రీకరించడం, క్రమశిక్షణ, వినయం, విజయంలో పాతుకుపోవడానికి ఉన్న ప్రాముఖ్యాన్ని కూడా ఇది వివరిస్తుంది' అని జోడించింది. సచిన్ తెందుల్కర్ తన కెరీర్ లో ఆరు వరల్డ్ కప్ టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. అత్యధిక వరల్డ్ కప్లు ఆడిన బ్యాటర్ గా రికార్డ్ సృష్టించాడు. అతడు 45 వరల్ కప్ మ్యాచుల్లో 2,278 పరుగులు సాధించాడు. అలాగే 2011 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. సచిన్ 2012లో వన్డేల నుంచి, 2013లో తన కెరీర్ లో 200వ టెస్ట్ మ్యాచ్ అనంతరం ముంబయి వాంఖడే స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ కు తన రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## ముందే ఊహించా.. 'జన నాయగన్' వివాదంపై స్పందించిన విజయ్



విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జన నాయగన్'కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు.

''నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను'' అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్ కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన 'జన నాయగన్' వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

## మారుతితో ప్రభాస్ మరో సినిమా..

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన చిత్రం 'ది రాజాసాబ్'. ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోకపోవడంతో ప్రభాస్ ఆయన దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ చేయనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. భారీ స్థాయిలో హోంబలే ఫిలమ్స్ దీన్ని నిర్మించనున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అవి రూమర్స్ మాత్రమేనని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ప్రభాస్ రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో 'స్పిరిట్'లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా మంచి ఆదరణ సొంతం చేసుకుంది. 2027 మార్చి 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. దీనితో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ'లో ప్రభాస్ నటిస్తున్నారు.



## అలా పిలిస్తే నాకేం ఇబ్బంది లేదు!



దక్షిణాది ప్రేక్షకులు తనపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిదని అంటోంది నటి శ్రియా శరణ్. 'సంతోషం', 'నువ్వే నువ్వే', 'ఎలా చెప్పను' లాంటి ఎన్నో ప్రేమకథా చిత్రాలతో అభిమానుల్ని ఆకట్టుకున్న కథానాయికీమె. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటోన్న ఈమె.. ఇటీవలే 'స్పేస్ జెన్: చంద్రయాన్' అనే సిరీస్ తో ఓటీటీ వేదికగా సందడి చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియ తన కెరీర్ ప్రారంభం రోజుల్ని గుర్తుచేసుకుంది.

''బాల్యమంతా హరిద్వార్ లోనే గడిచింది. ఆ తర్వాత కథక్ నేర్చుకోవడం కోసం దిల్లీకి వెళ్లి.. 17ఏళ్ల వయసులోనే నటించడం మొదలు పెట్టాను. అదే నా జీవితంలో మొదటి పెద్ద మలుపు. ఎందుకంటే మా నాన్న ఇంజనీర్, అమ్మ టీచర్. అలాంటి కుటుంబం నుంచి వచ్చి నేను నటిని అవుతానంటే అందరూ ఆశ్చర్యపోయారు. తర్వాత సినిమా సెట్ లకు వెళ్లడం, కొత్త భాషలు నేర్చుకోవడం ఇవన్నీ నన్ను భవిష్యత్ జీవితానికి సిద్ధం చేశాయ''ని అంది. 'సౌత్ స్టార్' అని తనని అభిమానులు పిలవడం గురించి మాట్లాడుతూ ''నన్ను అలా పిలవడం వల్ల నాకెప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదు. దక్షిణాది అభిమానుల ప్రేమకు కృతజ్ఞతలు'' అని చెప్పుకొచ్చింది శ్రియ.

## అమ్మనయ్యాక పూర్తిగా మారిపోయా ఆలియా



అమ్మ అన్న పిలుపుతో ఆడదాని లోకమే మారిపోతుందంటారు. హీరోయిన్ ఆలియా భట్ కూడా అందుకు అతీతురాలు కాదు. తల్లయ్యాక తన ప్రపంచమే మారిపోయిందంటోంది ఆలియా. మాతృత్వం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గర్భిణీగా ఉన్న తొమ్మిది నెలల్లో చాలా మార్పులొస్తాయి. శరీరమే కాదు మన ఆలోచన విధానాలు కూడా మారుతుంటాయి.

**డిలీట్ చేయాలన్న ఆలోచన**

ఎప్పుడైతే కడుపులో ప్రాణం పోసుకున్న బిడ్డను కళ్లారా చూస్తామో అప్పుడు పూర్తిగా మనల్ని మనమే మర్చిపోతాం. తనే ప్రపంచంగా మనకే తెలియనంతగా మారిపోతాం. మళ్లీ ఒకప్పటిలా ఉండాలనుకున్నా అది అసాధ్యం. చాలాసార్లు సోషల్ మీడియా డిలీట్ చేయాలనిపించేది. కానీ నా కెరీర్ ప్రారంభం నుంచి నన్ను సపోర్ట్ చేసినవారితో బంధాన్ని తెంచుకోవడం ఇష్టం లేక ఆ ఆలోచన విరమించుకున్నాను. కొన్నిసార్లు నా వ్యక్తిగత విషయాల్ని అందరితో పంచుకోవాలనిపించడం లేదు.

**నేను కూడా ట్రై చేయాలి**

అది నా పర్సనల్ అని నా అభిప్రాయం. నా ఫోన్ లో మొత్తం రాహా ఫోటోలే ఉన్నాయి. నేను కూడా అప్పుడప్పుడు ఫోటోలు దిగడానికి ప్రయత్నించాలి అని చెప్పుకొచ్చింది. ఆలియా భట్- రణ్ బీర్ కపూర్ 2022లో పెళ్లి చేసుకున్నారు. అదే ఏడాది వీరికి కూతురు రాహా జన్మించింది. ప్రస్తుతం ఆలియా, రణ్ బీర్.. లవ్ అండ్ వార్ సినిమా చేస్తున్నారు. నిర్మాతగా డోంట్ బీ షై సినిమా చేస్తోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.